సీతారామరావు, ముడియం

గంగానది

రాజమహేంద్రవరము, 1926

Record no. 810

Sītārāmarāvu, Muḍiyaṃ

Gaṅgānadi

Rājamahēndravaramu, 1926

Record no. 810

సీతారామరావు, ముడియం, b.1880.

గంగానది / ముడియం సీతారామరావుగారిచే వ్రాయబడినది.- 1. కూర్పు.- రాజమహేంద్రవరము : అద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడు, 1926.

92 p. :bill. ;19 cm.

Record no. 810

Sītārāmarāvu, Muḍiyaṃ, b.1880.

Gaṅgānadi / Muḍiyaṃ Sītārāmarāvugāricē vrāyabaḍinadi.- 1. kūrpu.- Rājamahēndravaramu : Addēpalli Lakṣmaṇasvāmināyuḍu, 1926.

92 p. :bill. ;19 cm.

Record no. 810

రామచంద్ర గ్రంథమాల 26

గంగానది

THE GANGES

M. SITARAMA RAU, B. A., L. T.,

1926

 [PRICE 0—9—0

రామచంద్రగ్రంథమాల.

ఈ గ్రంథమాలలో ఇప్పటికి 26 గ్రంథములు వెలువడినవి. ఇవి విద్యాశాఖాధికారులచేనామోదింపఁబడి పాఠశాలలయం దుపయోగింపఁ బడుచున్నవి. వీనికిఁదోడుగా శాశ్వత చందాదారులును పోషకులును కొందఱుండిరేని ఎక్కువపుస్తకములు వెలువడుటకు ఆస్పదముండు ననుటయే యీ ప్రకటనమునకుఁ గారణము.

ఈ గ్రంథమాలయందు (a)జీవితచరిత్రములు,(b) శాస్త్ర గ్రంథములు, (c)కథలు నవలలు అను 3 శాఖ లుండగలవు. శాశ్వతచందాదారులకు పుస్తకములవెలలో మూడవభాగము మినహాయింపబడును. చందాదారులగువారు ఇంతకుముందు ప్రకటింపబడిన పుస్తకములునన్నింటిని గొనవలసిన యావశ్యకము లేదు. కనీసము 3–0–0 వెలగలపుస్తకములను 2 రూ. లకు గాని, (అధమ) మే రెండుశాఖలలోనైన వెలువడెడుగ్రంథముల వీ. పీ. లను దీసికొనినఁజాలును. మూడవశాఖలోని గ్రంథములు కావలసినయెడల పంపబడును. ప్రవేశరుసుము 0-8-0. ఇంతకుముందు వెలువడిన గ్రంథముల నన్నింటినికూడ ఇష్టపడినవారు కొనవచ్చును. వానివెలలో 2/5 భాగము తగ్గింపబడును. తపాలుఖర్చు ప్రత్యేకము.

N. B ప్రవేశరుసుము 0-8-0 దరఖాస్తు వెంట ముందుగా బంపవలయును.

ముడియం సీతారామరావు, బి. యే., యల్. టి.

రామచంద్రగ్రంథమాలా ప్రకాశకులు,

June 1926 చంద్రగిరి, చిత్తూరుజిల్లా.

రామచంద్రగ్రంథమాల: 26

గంగానది

రాజమహేంద్రవరము వీరేశలింగము హైస్కూలు
ప్రధానోపాధ్యాయుఁడుగానుండిన
ముడియం సీతారామరావు, బి. యె., యల్. టి., గారిచే
వ్రాయఁబడినది.

మొదటికూర్పు.

రాజమహేంద్రవరము
అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారి సరస్వతీ పవర్ ప్రెస్‌నందు
ముద్రింపఁబడియె.

1926

 [వెల 0—9—0

కెనిల్‌వర్తు నవల


సర్ వాల్టరు స్కాట్ కవిచే నాంగ్లభాషయందు విరచితమయిననవల కిది అనువాదము. 220 పుటలు. మంచి కాగితములు. పెద్దఅక్షరములు వెల 1—4—0.

అక్బరు చరిత్రము

మొగలు చక్రవర్తులలో మహామహుఁడని పేరుగాంచిన అక్బరు చరిత్రముకూడ సుమారు 200 పుటల గ్రంథమగును. నునుపైన కాగితములమీఁద ముద్రింపఁబడి పటములతో విరాజిల్లుచుండెను.

(అచ్చుకానున్నది)

Mr. M. Sitarama Rao, B. A., L. T., Chandragiri.



గంగానది

1. ప్రస్తావన

ఈప్రపంచమున నీటి యావశ్యకత యింతయని వివరించుట సాధ్యము కాదు. పిపీలికాది సమస్త జంగమములకును నాచు మొదలగు సమస్తస్థావరములకును జలము ప్రాణతుల్యము. కావుననే దయామయుండగు పరమేశ్వరుఁడు భూగోళంబున మూఁడు భాగముల నీటిని నింపి ఒక్కభాగమున మాత్రమే నేలను నిర్మించి యున్నాఁడు. ఈనీటి యావశ్యకత ఉష్ణాధిక్యము గల దేశములందు మిక్కిలి యధికముగ నుండుట సహజము. ఆ దేశములందు నీరు కొఱవడెనేని సస్యములు పండఁజాలవు. మేతలేక పశువులు మృతిఁ జెందును. త్రాగుటకుఁ గూడ నీరు దొరకనపుడు మానవుల జీవనము దుర్భరమగును. ఇదియే క్షామము. భయంకరమగు నా క్షామముల వారింపుమని "మొఱ్ఱో! వాన దేవుఁడా" యని ప్రజలు దేవునిఁ బ్రార్థించుచుందురు.

ఇట్టి దేశములందుఁ జేరినది మనభరతఖండము. ఇందుఁ గొన్నిమాసములందు మాత్రమే వర్షము కురియును. ఏకారణము చేతనైననువర్షమపుడు తక్కువగఁ గురిసెనేని దేశ

మున క్షామడాంబరములు తప్పనివగును. వానివలనఁగలుగు జననాశమునకు మితియే యుండదు. కావుననిట్టి దేశములందు నదులు మిక్కిలి ప్రాముఖ్యముకలిగి యుండుట వింత కాదు. దేహమునకు రక్తనాళము లెట్లుపకరించునో అట్లే జలపూరితములగు నదీనదములు తాము ప్రవహించు భాగములకు శుద్ధమగు నీరంబుల నిచ్చుటయే కాక భూములకుఁ గావలసిన యెరువును సయితము, వండుమంటి రూపముననిచ్చి సస్యసమృద్ధికిఁ దోడ్పడి ప్రజలకు జీవనోపాయము గల్గించి కన్నతల్లులవలె జనులఁ బోషించుచున్నవి. కావుననే మనదేశములోని నదులకు అనాదినుండి స్త్రీత్వమారోపించి తల్లులవలె మనదేశీయులు వానిని బూజించుచున్నారు. వీనిలో గంగ, గోదావరి, కృష్ణ కావేరి నదులు చాల ప్రసిద్ధి కెక్కినవి. వానిలో నన్నిఁటికంటెను గంగానదియే మిగుల ఖ్యాతిఁ గాంచినది.

ఈగంగానదీప్రదేశమే నాగరకతకుఁ బుట్టినిల్లనితోఁచుచున్నది. పాశ్చాత్య దేశములన్నియు అధమ దశయందుండినప్పుడు, అచటిజను లడవిజంతువులవలె సంచరించుచుండినప్పుడు, ఈయార్యావర్త మన్నివిధములఁ బేరొంది యుండెననుటకు సందియములేదు. గంగానదీ జలములచేఁ బోషింపఁబడుచుండిన నీపుణ్యభూమి ఫలభరితంబై, వివిధసస్యశోభితంబై జనసమృద్ధంబయి సర్వసంపదలచేఁ దులఁదూగుచుండెను. ఈస్వాభావిక సంపదను జూచియే విదేశవాసు లార్యావర్త

ముపైఁ గన్నువైచి య్యెపుడెప్పు డాదేశమును స్వాధీనపఱచుకొందుమా యని వేచియుండిరి. ఈ స్వభావసంపదకుఁ దోడు జనులు చేతిపనులలో ఖ్యాతిగాంచి నయమైన వస్త్రములు నేయుటయు, అందమైన యాభరణములఁ జేయుటయు మొదలుగాగల హస్తకౌశల్యముఁ జూపు పరిశ్రమల యందును జిత్రలేఖన సంగీతాది లలితకళలయందును ప్రజ్ఞావంతులై యుండిరి. ఈ ప్రదేశమున రాజ్యము లెన్నియో ప్రబలెను. హారిశ్చంద్రాది షట్చక్రవర్తు లిచటి మండలముల నేలుచుండిరి. కౌటిల్యాది రాజ్యతంత్రజ్ఞులు అర్థశాస్త్రాది న్యాయశాస్త్ర గ్రంథముల రచింపఁగల్గిరి.

మన పూర్వులగు ఆర్యు లీభౌతిక విషయములతో దృప్తిపొంది యుండిన వారలు కారు. ఆధ్యాత్మిక విషయమునందు వారు చేసిన కృషి నేటికిని నవనాగరకులని పేరొందిన పాశ్చాత్యులకు సయితము మార్గదర్శకముగా నున్నది. ఉదరపోషణార్థమున కావశ్యకములగు సస్యము లిచట విశేషశ్రమలేకయే పండుచుండుటచేతఁ దీరికగల జనులలోఁ బ్రతిభావంతులు గొంద ఱాధ్యాత్మిక విషయముల నాలోచనచేయ గడంగి, వేదభాగములగు మంత్రములను బ్రాహ్మణములను, ఉపనిషత్తులను వ్రాయుచు, జీవాత్మ పరమాత్మల కుండు పరస్పర సంబంధములఁ గూర్చి చర్చింపఁగలిగిరి.

ఆర్యావర్తమిట్లన్నివిధముల నుత్కృష్టదశకేతెంచి యుండుటకు కారణైకమగు గంగానది ఆర్యావర్తపు జనులకే

గాక భరతఖండమునఁ బుట్టిన ప్రతిమనుజునకును మిక్కిలి పవిత్రమయ్యెను. లక్షల కొలది జను లీగంగను దర్శించుట కన్ని భాగములనుండియు అనుదినము వచ్చుచుందురు. ఉత్పత్తి స్థానము మొదలు సముద్రసంగమమగు వఱకును ప్రతిఘట్టము నందును వేనవేలు జను లీనదీజలములఁ గ్రుంకిడి తమ పాప పుంజంబులఁ బాపికొంటిమని సంతసింపుచుందురు. అట్లు చేయఁజాలని భరతఖండవాసు లతిభక్తితో నీనదీమతల్లి నామ మనవరతము స్మరణచేయుచు, ఆనామస్మరణముచేఁ బులకి తులై అదియ పాపవిమోచనమునకుఁ గారణమని విశ్వసించు చుందురు. కావున గంగానదివలె నిట్లుపవిత్రముగఁ బరిగ ణింపఁబడునది మఱియొకటి ప్రపంచమున నెచ్చటను గానరాదు. ఇట్టి పూజ్యమైన నదీమతల్లి ప్రభావముంగూర్చిన కథలనేకము లున్నవి. ఆపురాణకథల నిట వివరింపుచు నీమహానదిని గొంతవర్ణించి చెప్పెదము.

2. హిమాలయ పర్వతజననము

గంగానదికి ఉత్పత్తిస్థానమై దానినిరంతర వాహినిఁ గాఁజేసి, దానినుండి వందునుంటెనిఁ బంపుచు, ఆనదీ సమ భూమినంతను ఫలవంతము చేసి భారతీయులచేఁ బొగడ్తఁ గాంచిన మహీధరము హిమాలయపర్వతము. ఇది ప్రపంచ పర్వతంబులలోనెల్ల ఔన్నత్యమున గొప్పదయినను వయసు నందు మాత్రము మిక్కిలి చిన్నదని భూతత్వశాస్త్రజ్ఞులు (Geologists) నిర్ణయించి యున్నారు.

యుగముల క్రిందట ఈహిమాలయపర్వతము లుండినవి కావు. హారావళి వింధ్యపర్వతములుమాత్రమె యిపుడున్నట్లు దక్కనుపీఠభూమికి ఎల్లలుగా నుండెడివి. మిగతభాగ మంత యు అనగా బెలూచిస్థానము, ఆఫ్గనిస్థానము, సింధునదీ ప్రదేశము, రాజపుత్రస్థానము, బర్మా టిబెటుదేశము లుండు ప్రదేశ మంతయు లోతులేని సముద్రభాగముగ నుండినది.

ఇట్లుండ నత్యుగ్రమగు అగ్నిపర్వతోత్క్షేప పరంపరలు (Series of Volcanic eruptions) కలుగ మొదలిడెను. రెండులక్షల చదరపుమైళ్ళ నేల యంతయు వేలకొలది యడుగుల యెత్తు శిలాద్రవముచేతను (lava) బూడిదచేతను నున్నుచేతనుఁ గప్పబడెను. అప్పుడే మన దక్కనుపీఠభూమికి ఇప్పటి స్వరూప మేర్పడినది. ఆకాలమునఁ బ్రవహించిన శిలా ద్రవమే యిప్పుడు శిథిలమై నల్లరేగడి భూమిగా మారి వందలకొలది సంవత్సరములనుండి ప్రత్తి పంట నవిచ్ఛిన్న ముగా నిచ్చుచున్నది. ఆ యగ్నిపర్వతోత్క్షేప కారణమున ఉత్తరభాగమున భూపటలము (Earth's crust) పైకి లేవ మొదలిడెను. దానిచేత ఉత్తరభాగ మంతయు ముడుతలు ముడుతలు పడుచు ఇరువదివేల యడుగుల ఔన్నత్యముగల మహీధర మేర్పడెను. పడమటి హిమాలయములు, టిబెటు దేశము (త్రివిష్టపము) బర్మాదేశము లీగడిబిడలలో నేర్పడి నవి. ఇట్లగుటచేత నీ భాగముల నావరించియుండిన సముద్ర ము వెనుకకుఁ బోవుట తప్ప దయ్యెను.

పైనిఁ జెప్పఁబడిన మారుపాటులు భూతలమున జరుగుచుండ ఆ భూక్షేపముల వలన నాపాదించిన ఘోరనాశనముఁ దిలకించి వీని కారణముల నూహింపఁజాలక అవి యన్నియుఁ గ్రూరులగు రాక్షసుల కృత్యములనియు, ఆ రాక్షసులు కంటి కగుపడకుండుటచేత వా రందఱు దేవతలకు భయపడి సముద్రమున దాగియుండి అంధకారసమయంబున వెలుపలికే తెంచి తమ్ము బాధించుచుండిరనియు, మనపూర్వీకులు తలంచిరని మన మూహింపవలసియున్నది. కావున భూగర్భమందలి వాయుకములయొక్కయు, ఆవిరియొక్కయు విరళశక్తిచేత ఉత్క్షేపము కల్గి దాని ధాటివలన భూభాగ మంతయు బైకెగసినపుడు ఆ యద్భుతంబునకు హేతువు నిర్ణయింపఁజాలక, అమ్మహాకార్య మొక మహామహుని మాహాత్మ్యంబుచేఁ గలిగినదని తలంచి, దానిం దెలియఁజేయుటకు వారీకథను గల్పించిరని మన మూహింపవలసియున్నది.

3. అగస్త్య చరిత్రము

కృతయుగంబున వృత్రాసురుఁ డను రక్కసుఁ డొకఁ డుండెను. ఆతఁడు పోతరించి కాలకేయులను [illegible]త్రించుకుల సాయంబుఁ గొని అమరలోకంబున కేగి ఇంద్రాదిదేవతల బాధింప మొదలిడెను. వా రా బాధలఁ దాళంజాలక బ్రహ్మకడ కేగి వృత్రాసురుచేఁ దా మొందిన భంగపాటులఁగూర్చి మొఱబెట్టుకొనిరి. అజుఁడు వారల నోదార్చి "నిర్జరులారా! వృత్రుండు సామాన్యుండుగాడు. వాని వధించుట యేరికిని

సాధ్యంబు కాదు. అయిన నే నొక యుపాయంబుఁ జెప్పెద వినుండు. సరస్వతీ తీరంబున నిష్ఠాగరిష్ఠుండై నిశ్చింతతోఁ దపం బొనర్చు దధీచమహాముని యొకఁడు కలఁడు. మీ రాతని పాలికిం బోయి మీ యిడుముల నాతనికిం దెలియఁ జెప్పి ఆతని యస్థుల నిమ్మని ప్రార్థింపుఁడు. అతఁడు కరుణాంతరంగుండు. దైవహితైకపరాయణుండు స్వార్థత్యాగి. కావున నాతఁడు తన యస్థులఁ దప్పక మీ కిచ్చును. వానిచే వజ్రాయుధాది దివ్యసాధనంబు లుద్భవిల్లు. కావున "మీరు సత్వరంబుగ దధీచుపాలికిం బొం"డని విరించి వారలతోఁ జెప్ప నాయనిమిషు లాతనికిం బ్రణమిల్లి వెనుకకు మరలి దధీచనివాసంబునకుం జని కృతప్రణాములై యిట్లని ప్రార్థింప మొదలిడిరి.

క. "భువనజనస్థుత నిజగా
రవమొసఁగఁగ నమరపతి పురస్కృతులగు ని
ద్దివిజులకెల్ల హితంబుగ
భవదస్థిచయంబు లిమ్ము పరమమునీంద్రా!"

ధధీచుండా ప్రార్థన విని సంతసిల్లి "నేనిపుడ కృతార్థుండ నైతి. దేవహితార్థంబుగా నాయసువులఁ బాసెద" ననుచు నిమీలితనేత్రుండై యున్నట్టుండి తన ప్రాణంబులఁ బాసె. పిదప దివిజు లమ్మహాముని యస్థులం గొని వాని నాయుధంబులుగాఁ జేసికొనుచుండ త్వష్ట నూఱుధారరమ్యమై యనలకణాకరాళమైన వజ్రాయుధం బొనర్చి "దీనిచే దైత్యులఁ

"నిర్జింపు" మని పర్జన్యునకొసంగెను. దానిసాయంబున నమ
రపతి వృత్రాసురువధించెంగాని కాలకేయాదు లాతనిధాటికి
వెఱచి సముద్రముల జొచ్చి దివంబులెల్ల నవ్వానధి నడంగి
రాత్రులం దాజలంబుల వెల్వడి, జనుల బాధింప మొదలిడిరి.
"విద్యాధనులై తపోయుక్తులై ధర్మచరితులై యుండువారి
కారణంబున జగంబు లపాయంబు నొందక సుఖంబున్న
యవి గావున అట్టివారిని రోసి వధియించి జగంబుల కపా
యంబు సేయుద" మని వారు నిశ్చయించి వశిష్ఠాశ్రమంబు
నకుంబోయి యట నూటయెంబదియేడ్వురను, చ్యవనాశ్ర
మంబున నూర్వురను, భారద్వాజాశ్రమంబున నిరువదుండ్ర
నుంగా బలువురు బ్రాహ్మణుల బ్రహ్మమయుల భక్షించి,
అంతటితోఁ దనివినొందక అఖిలమునిగణాశ్రమంబుల నుప
ద్రవంబు సేయంజొచ్చిరి. దీనంజేసి యాగాది పుణ్యకర్మ
ములు నిలిచిపోయె. దేవతల బ్రతుకు నిర్భరమయ్యె. కావున
నా రేకమయి దిశానాథుల వెంటంగొని వైకుంఠంబునకుం
బోయి, త్రిభువనపతియు గరుడవాహనుండును అగు నావై
కుంఠుం బొడగాంచి కేలుమోడ్చి "దేవా! నీవు వరాహ
రూపధరుండవై మహీతలంబు నుద్ధరించితివి. నరసింహ
రూపంబుఁ దాల్చి యాదిదైత్యుండగు హిరణ్యకశిపుం బరి
మార్చి ప్రజారక్షణంబుఁ గావించితివి. వామనావతారంబున
బలింగట్టి యజ్ఞమూర్తివై యజ్ఞవిఘ్నకరుండైన జంభుండను
దానవునిం దెగటార్చి చతుర్విధ ప్రజల రక్షించుచున్న జగ

ద్రక్షకుండవైతివి. మహానుభావా! మావిన్నపం బాలకించి
యిప్పుడు జగంబుల కాపాదించిన యపాయంబు నుండి
మమ్ముల రక్షింపవేడెదము. అంబుజోదరా! మావిన్నపం
బాలకింపుము. కాలకేయులను రక్కసులు విజృంభించి బ్రా
హ్మణులం బొలియించుచున్నవారు. వారుపవలంతయు నీటం
దాగియుండి రాత్రులందుఁ బరమసాధువులగు భూసురుల
హింసించి మహికి బాధ యొనర్చుచున్నవారు. వారల సమ
యించి యఖిల లోకంబులకు మేలొనగూర్పుం"డని కృతాం
జలులై ప్రార్థింప నద్దేవుం డుదరహాసితవదనుండై

మ. కాలకల్పులఁ గాలకేయులఁ గాలకాయులభూరి ర
త్నాలయస్థుల వీర్యవంతుల నర్ణవంబు సమస్త స
త్త్వాలిదోఁపఁగ వట్టినర్క విషయంబగుక వధియింపఁగాఁ
బోలదొండు విధంబునం బరిపూర్ణవార్థిజలోన్నతిన్.

"కావున మీరలందఱే తెంచి మైత్రావరుణతనూజుం
డును అధికవీర్యవంతుండును అగు అగస్త్యమహామునిం బ్రా
ర్థింపుడు. ఆతఁడు సముద్రజలంబులం ద్రావియారక్కసులకు
నిలువ నీడ లేకుండఁజేయును. మీ రిప్పుడు వారలం దును
మాడఁగలరు. పోయిరండని వారలకుం జెప్ప మహాప్రసాదం
బని అమ్మహాదేవునకుం బ్రణమిల్లి అమరులెల్ల నగస్త్యు
పాలికింజని యాతని స్తుతియించి యిట్లనిరి. "మునీంద్రా!
జగద్ధితమై వింధ్యంబు సణఁగఁద్రొక్కిన మహానుభావుండ వీవ
కదా! అట్టి మీ కసాధ్యం బెద్దియైనం గలదా! మమ్ముం గఱ

రక్షించుట మీఁదియభారమ'ని ఆతనిం బ్రస్తుతింప నమ్మహాముని దయారసం బుప్పతిల్ల 'మీరేల వచ్చితిర'ని యడిగెను. కాలకేయాదులచేఁ దాము పడుచుండు బాధలవారు వివరముగఁ దెల్పి 'మునిసత్తమా! సముద్రజలంబంతయుఁ బానము చేయుఁడని ప్రార్థించిరి. అమ్మహాముని దానికి సంతసించి మునిగణసహితుండై, యమరులు వెంట నడువ, సిద్ధగంధర్వపన్నగయక్షగణంబు లాతని మహిమంబు గొనియాడుచుండ నీరధియొద్ద కేతెంచి—

"ఉ. అందఱుఁ జూచుచుండగ మహాబ్ధిజలంబుల ద్రావెవిష్టపా
నందకరుం డగస్త్యుడ ఘటనాశనుఁడట్లు పయోధిరిక్తమై
నండిమి కూర్మకర్కటకనక్రభుజంగచయంబుతో భయం
బందుచుఁ గాలకేయులుబయల్పడితోఁచిరిదానిలోపలన్"

ఇట్లు బయల్పడిన కాలకేయాది దానవులతో నిలింపనాయకుండు పోరి వారల రణంబున నిర్జింప కొందఱు హతులైరి. కొందఱు పాఱిపోయి పాతాళంబు జొచ్చిరి. కాలకేయులవలని బాధల నిట్లు నివారణంబుగావించి తమ్ము రక్షించుటచే దేవత లగస్త్యునిం గీర్తించి "మునిపుంగవా! నీయనుగ్రహమున నఖిల భువనంబులకు నిగ్రహం బుడిగె. ఇకనివ్వనధింబయఃపూర్ణంబుగా నొనర్ప మీరుగాక మఱియెవ్వరు గలరు? అనేక సత్త్వాశ్రయంబగు నివ్వనధి రిక్తంబైయుండఁ దగదు కావున దీని సత్వరంబుగాఁ చూర్ణంబుగావింపుడన "నిలింపులారా! నేఁద్రావిన జలంబంతయు నాకుక్షియంద

జీర్ణంబయ్యె. ఆజలంబిఁక వచ్చుట యసాధ్యం"బనివచించె. దేవతలందఱు విరించికడకేగి యాతనిం బ్రార్థింప నతఁడు పెద్దయుంబ్రొద్దు చింతించి "అయ్యలారా! ఇది ప్రస్తుతము నసాధ్యంబుకాదు. పెద్దకాలంబున భగీరథుండనువాఁడు దీని నించును. అంతవఱకు మనము వేచియుండ వలయుంగాని వేఱుసాధనంబు గానమికిఁ జింతించెద"నన వారందఱు దీనవదనులై నిజనివాసంబులకుం జనిరి.

పైనిఁజెప్పినదానిం బట్టిచూడ ఉత్తరహిందూస్థానమంతయు నొక మైదానముగానుండెననియు అందు సింధునది యనాదిగా పడమటికి బ్రవహించుచుండెననియు, దఱువాతఁ గొంతకాలమునకు నడిమిభాగ ముబుకుటచేత అది జలవిభాజకక్షేత్రమయి (Water parting) అంతవఱకు నొకటిగానుండిన నదీపాత్రి (river basin) రెండు భాగములయ్యెననియు విశదమగుచున్నది. దీనిచేతఁ బడమటిది సింధునదీపరివాహప్రదేశముకాఁగా, దూర్పుననుండునది గంగానదీపరివాహప్రదేశముగ నేర్పడెను. అప్పుడు హిమవత్పర్వతమునుండి ప్రవహించుచుండిన నదికి వ్యక్తిత్వ మేర్పడుటచేత అది గంగానది యనం బరగెను.

ఈవిషయమునె మన పురాణపురుషులు గంగావతరణము కథగా వర్ణించిచెప్ప మొదలిడిరని మనము తలఁపవలసి యున్నది.

4. హిమాలయపర్వత వర్ణనము

చ. అటఁ జనికాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరిజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుటనటనానురూప పరిఫుల్లకలాప కలాపిజాలమున్
గటకచరత్కరేణు కరకంపితసాలము శీతశైలమున్."

(మనుచరిత్రము.)

యుగములక్రిందట అగ్నిపర్వతోత్క్షేపములు కలుగుటచేత భూపటలము ముడుతలుపడి అత్యద్భుతమైన పర్వతప్రదేశముగా నేర్పడినది. ఇట్టి పర్వతప్రదేశ మెచ్చటను బ్రపంచకమునఁ గానరాదు. ఇందథమము రెండు పర్వతపంక్తులు తూర్పుపడమరలు వ్యాపించి ఒకదానినుండి మఱియొకదానివఱకు నేర్పడియుండు శాఖలచే రెండును గలిసియున్నవి. ఇందు దక్షిణపంక్తి పడమట సింధునదీకందరము (Surge) నుండి తూర్పున బ్రహ్మపుత్రానది కందరమువఱకును 1500 మైళ్ళు వ్యాపించియున్నది. వేసవికాలపు ఋతుపవనముచేఁ దేబడిన యావిరియంతయు నీ పర్వతపంక్తిచే నడ్డగింపఁబడి దాని నితంబప్రదేశమునఁ జల్లబడి వర్షరూపమునఁ ధారాపాతముగాఁ బడుచున్నది. అత్యున్నతభాగములందు ఘనీభవించిన యావిరి హిమరూపమును ధరించి పర్వతాగ్రములను మేలివెలిముసుంగువలెఁ గప్పుచున్నది. ఈకారణముచేత నీపర్వతపంక్తికి హిమాలయమని పేరువచ్చెను.

ఈ దక్షిణపర్వతపంక్తి కుత్తరమున మఱియొకపంక్తి

యున్నది. కాని దీనికిఁ దగులు పవనములందు తేమ తగ్గియుండుటచేత నిచట వాయువు తడిగా నుండుటలేదు. ఆకారణమున నిచట హిమము తక్కువగ నుండుటయేగాక ఆహిమమంతయు అత్యున్నతప్రదేశములందు మాత్రమె కన్పడుచుండును.

కావున దక్షిణపంక్తియందుననే యెక్కువ హిమముండుట. ఇచటనే హిమానీనదము లనేకము లుద్భవించి అవి నదీనదముల కుత్పత్తిస్థానము లగుచున్నవి.

ప్రపంచపుఁ బర్వతములన్నిటికంటెను హిమాలయపర్వతము లత్యున్నతములయినవి. దాదాపుగా నివి యిరువదినేల యడుగుల యెత్తువఱకు వ్యాపించి మన భరతఖండమును బెట్టనిగోడవలె శత్రువులనుండి సంరక్షించుచున్నవి. ఇందలిశిఖరములకంటె నెత్తైన శిఖరములు ప్రపంచమున నెక్కడను గానరావు. గౌరిశంకరశిఖరము (Mt. Everest) 29002 అడుగులయెత్తుగలదై హిమముచేఁ గప్పబడియున్నది. నంగపర్వతము (26000 అ.) నందాదేవి (25000) ధవళగిరి (26000) గోసాయినాథ్ (24000) కాంచనగంగ మొదలగునవి యుత్తరశిఖరములు. ఇందన్నియు హిమరేఖపై నుండుటచే నిరంతరము హిమముచేఁ గప్పఁబడియుండును.


ఇట్టి యున్నతశిఖరముల నెక్కుట మిక్కిలి కష్టము. ఇంతవఱ కెవ్వరును ఈశిఖరాగ్రముల నెక్కినవారు లేరు ఈవలఁ గొందఱు వీరవరులు వీనినింజూడ నిశ్చయించి

అచటి కష్టములం బాటింపక హిమానీనదముల దాటుచు మిక్కిలి చల్లని సెలయేటి నడుచుచుం, గంధరముల దూరుచునున్న నిర్ఝరులం ద్రాకుచు ప్రాణము లఱచేతం బట్టుకొని సూర్యుని వెలుంగునం గనుల మిఱుమిట్లు గొల్పు హిమముపై నడుచుచు 23,000 అడుగులయెత్తు ప్రదేశమును జేరిరి. కాని యచటి శైత్యమును సహింపంజాలకయు, ఉన్నట్టుండి అచట వీచుచుండు మంచు తుపానుల ధాటికి నిలువంజాలకయు బాధపడంజొచ్చిరి. కష్టము లంతటితో దీరినవికావు. ఆయున్నతప్రదేశముల విరళీకృతమైయుండు వాయువువలన ఉచ్ఛ్వాసనిశ్వాసము లసాధ్యమయ్యె. హృదయకుహరము పగులునట్లుండెను. కనుగ్రుడ్లు వెలుపలికూడిపడునట్లు తోచెను. కావున వారాయుద్యమము వదలుకొని క్రిందికి మరలిరి. అయినను గౌరీశంకరము నెక్కవలయునను దృఢనిశ్చయ మింకను వారల వదలకుండుటచేత మఱియొకమారీకార్యమునకుం బూన వారు సాహసించెదరని తోచెడిని.

ఈ హిమాలయపర్వత మౌన్నత్యమునందేగాక వైశాల్యమునందుంగూడం జాలగొప్పది. తూర్పుపడమరలు దాదాపుగా 1500 మైళ్ళు వ్యాపించియున్నదని చెప్పియుంటిమి. ఉత్తరదక్షిణములు 150,200 మైళ్ళవఱకు వ్యాపించి శాఖోపశాఖలు కలిగి అత్యద్భుతముగానున్నవి. ఈ పర్వతప్రదేశపు నడిమిభాగముననే ఉన్నతశిఖరములుండుట. ఇవియే హిమానీనదములకుం బుట్టినిండ్లు. ఈపర్వతపంక్తికి దక్షిణమున


పర్వతమువెంబడి కంటకమువలె గొప్ప పల్లపుప్రదేశము కలదు. ఇది గొప్ప యరణ్యప్రదేశము. దీనికి టారేయి (Tarai) యని పేరు. ఇచ్చట వర్షాతపము లత్యధికమగుటచే నరణ్యముదట్టముగనున్నది. టేకుసాలవృక్షములనడుమ వెదురు పొదలు చిక్కగ నుండుటచేత వానిక్రిందం బెరుగు తీగలు దట్టముగ నల్లుకొని క్రూరజంతువులకు నయిత మాయరణ్యముక్కొకచోం జొర నశక్యంబయి యున్నది. ఇందు పులులు ఖడ్గమృగములు, అడవిదున్నలు యేనుగులవ్వారిగ దిరుగుచుండును. వివిధములైన కీటకములు ఝుమ్మని రొదచేయుచుండును. అయిన నీ చెమ్మనేల జ్వరాదులకుం బుట్టినిల్లగుటచే మానవులకు నివాసయోగ్యముకాదు. మృగయాకుతూహలుల కిది రమణీయమైన తావని నిస్సంశయముగం జెప్పవచ్చును.

హిమాలయపర్వతము లున్నతములై మనభరతఖండమును రక్షించుచున్నను పడమటి శాఖలంత యెత్తైనవికావు. వర్షము తక్కువగం గురియుటచేత హిమమంతగాం జేరదు. చలి యధికమయినను ఈశాఖ లందు యిరుకైన మార్గములు కలవు. ఈమార్గములకే కనుమలని పేరు. వీనిలో ఖైబర్ బొలన్ కనుమలు పేరొందినవి. ఈఖైబరు కనుమునుండియె మహమ్మదీయు లేతెంచి మనదేశమును గొంతకాలము రాజ్యము చేసిరి.



ఖైబరుకనుమ

ఇపుడీఖైబరు కనుమగుండ రైలుదారి వేసియున్నారు. కావున ప్రయాణమిక పూర్వముండినట్లు కష్టముగ నుండదు. గాన రాకపోక లధికమయి ఆఫ్గన్ దేశీయులకును భరత ఖండవాసులకును ఐకమత్య మధికమగునని మనమూహింప వచ్చును. తురుష్కస్థానమునకు బోవువారలకు ప్రయాణ కష్టమింకను తప్పినదికాదు. జడలబఱ్ఱెల సాయమున సామా నులు మోయించుకొని కఠినమగు కనుమలదారిని పర్వతము నెక్కి యచటి చలివలన బాధలను సహింపవలసి యున్నది. ఇట్టీయుగముల క్రిందనేర్పడిన హిమాలయపర్వతములు మన భరతఖండమున కుత్తరమునకుఁ గోడవలెనేర్పడి దాని శత్రు వులనుండి గాపాడుచున్నవి. ఈపర్వతములు పడమట సింధు నది మొదలు తూర్పు బ్రహ్మపుత్రానదిసఱకును రమారమి 1500 మైళ్ళు వ్యాపించియున్నవి. దీనివెడలు పుత్తరదక్షిణము దాదాపుగా నూటయేబది మైళ్ళుండును. ఈపర్వతములు గంగ మైదానమునుండి నిట్టముగ 20000 యడుగు లున్నత ములై పర్వతశిఖరములచే నొప్పుచు నిరంతర హిమమున కాట పట్టులయి ఉత్తరముననుండు త్రివిష్టపపీఠభూమితోఁ గలిసి దానికి దక్షిణపు టంచయియున్నవి. వీనియందుండు కానలు కోనలు, నదీనదములు, ఝురులు హిమానీనదములు కనుపండు వులై వర్ణనాతీతమై పరమేశ్వరుని యద్భుతశక్తిని వేనోళ్ళఁ జాటుచున్నవి.



హిమాలయపర్వతప్రవాహము

ఈపర్వతముల క్రిందిభాగము ఉష్ణమండలములోనుండుటచేత దుర్గమం బగు అరణ్యరాజంబులచే నొప్పుచున్నది. పైకిపోయినకొలది సరుగుడు చెట్లచే శోభిల్లుచు గడపట మధ్యందిన మార్తాండుని కిరణములలో గన్నుల మిఱుమిట్లు గొలుపుచు సాయం ప్రాతఃకాలములందు చిత్రవిచిత్రవర్ణములచే శోభితంబయిచూపరుల కానందము గల్గించుచు బర్వతశృంగములున్నవి. ఇట్టి యద్భుతమగు పర్వతరాజము శంకరు సదనమనియు, దేవతలు, గంధర్వులు కిన్నరులు కింపురుషులు సిద్ధులుసాధ్యులు, మునిసత్తములు మొదలుగాఁగల మానవాతీతులగు మహనీయులకు ఉనికిపట్టగుటచేఁ బుణ్యక్షేత్రమనియు, భారతీయులు తలఁచుటయం దేమియు విచిత్రము కాన్పింపదు. ఈపర్వత ప్రాంతములఁ జూడబోయిన వారలచటి యద్భుతంబులఁ బొడఁగాంచి పరవశులై పరమేశ్వరునితో లీనమయితిమని తలఁచుటయం దెద్దియు ఆశ్చర్యము తోఁపదు.

5. గంగపుట్టువునుగూర్చిన యితిహాసము

హిమవంతుఁడు కనకాద్రితనూభవయగు మనోరమను బరిణయ మయ్యెను. ఆ దంపతులకు గంగ ఉమయను యిరువురు కూఁతులుకల్గిరి. వారిలో గంగను దేవహితార్థము హిమవంతుఁ డమరుల కిచ్చుటచేత నామె వారలతో నమరావతి కేగెను. రెండవ కుమార్తెయగు ఉమ మహేశ్వరుం గూర్చి మహోగ్రతపము చేసి ఆయనను మెప్పింప, హిమవంతుఁ

డాయుమ నాతని కిచ్చి వివాహము చేసెను. ఈ వివాహ మహోత్సవంబుఁ జూడ నీ రేడు జగంబు లెల్ల నేతెంచుట చేత నా భారంబు భూమి సైరింపఁ జాలదయ్యెను.

"గీ. దేవదేవు పెండ్లి తెఱఁగొప్పనంతయుఁ జూడఁదలఁచి
నిక్కిచూచెననఁగ
దక్షిణంబుదిక్కు ధారుణియంతయుఁ గడలనొద్దగెడవు
గాఁగ నెగసె."

అపు డంతయుం బరికించుచుండిన సకలలోకరక్షకుండగు నారాయణదేవుం డమ్మహాదేవున కిట్లనియె.

"శా. స్వామీ శంకర! శంకరోరగపతీ! సంపూజ్యబృందారకా!
కామధ్వంసక! సర్వలోకములు మీకళ్యాణముఁ జూడ స
త్ప్రేమన్ వచ్చుటఁ జేసియుండఁగ మహావ్రేఁగై భరంబోర్వక
భూమీచక్రము గ్రుంగె నీవు సమతం బొందించి రక్షింపవే!"

అని ప్రార్థింప సర్వేశ్వరుండు

తరల. వరమునీశ్వర పద్మజాసన వర్ణనీయు మహాత్మునిన్
శరధులెల్లను లీలఁ ద్రావిన చండకోపునిఁ గోటి భా
స్కరసమానవిభున్ ధరాసమసత్త్వుఁ గుంభజుఁ బంపెను
స్థిరతమై సమమయ్యె దక్షిణదిక్కు ధారుణి చెచ్చెరన్.

సగరుని కథ

ఇట్లుండ నార్యావర్తంబున సరయూనదీ ప్రాంతంబుననుండు అయోధ్యాదేశంబును సగరమహారాజు పాలించుచుండెను. ఇతఁడు విదర్భరాజ తనూజయగు సుదేశి యనుదానిని,

అరిష్టనేమి యనునాతని సుతయగు సుమతి యనుదానిని వరించి వారలఁ బెండ్లియాడి సుత రత్నంబులఁ బొందఁ గోరి పత్నీసహితుండై హిమవంతంబునకుం బోయి అచట తపంబు సేయ మొదలిడెను. నూరు వత్సరము లయిన పిదప నా తపంబునకు భృగుండను తపోధనుండు మెచ్చి కోరిన వరంబుల నిచ్చెదనని చెప్పెను. సగరుఁ డందులకు సంతసించెను. అంతట భృగుండు "రాజా! నీభార్యలలో నొక్కరికొక కుమారుండును, మఱియొక్కరికి అఱువదివేవురుసుతులును గల్గెద"రని వరంబిచ్చెను. సగరుం డామాటల కమితానందంబు నొంది "మహానుభావా! నా భార్యలలో నెవ్వరి కొకసుతుండు జన్మించు? ఎవ్వరి కఱువదివేవురు పుత్రులు గల్గుదురు?" అని విన్నదనముతోఁ బ్రశ్నింప "రాజా! నీ భార్యలు కోరినట్లు వర మొసంగెదనని చెప్పెను. సుకేసిని కులపాలకుఁడగు సుతుం డొక్కఁడు చాలు ననియె.

బలపరాక్రమవంతులగు కుమారు లఱువదివేవురు తనకుఁ గావలయునని సుమతి కోరెను. 'అట్లయగుంగాక' యని యా మునిసత్తముండు వచింప నాతనికందఱు సాష్టాంగదండప్రణామంబు లాచరించి తమ నగరంబున కేతెంచి సుఖంబుననుండిరి.

కొంతకాలంబునకు సుకేసినికి అసమంజుఁడను సుతుం డుద్భవించె. సుమతికిఁ గ్రమముగా నఱువదివేవురు తనయులు కల్గిరి.

ఈ సగరపుత్రులలో నసమంజుఁడుపరమ దుర్మార్గుఁడు. దుష్ప్రవర్తన గలవారలతో గలిసి యీతఁ డొనర్పని దుండగము లుండినవికావు. మానాభిమానముల విడిచి పనిపాటులు వదలి తిరుగుచు, సరయూనదియందు బాలుర ముంచివేయుచు వా రూపిరి తిరుగక కొట్టుకొనుచుండచూచి నవ్వుచుండు దుస్స్వభావుఁ డితఁడు.

సాయంకాల. మగుడు ఈతఁడు తప్పఁద్రావి సరయూనది కేతెంచు యువతుల నవమానింపుచు నొడలు తెలియక ప్రేలుచుండును. ఇట్టి దుష్కార్యముల జనులు కొంతకాలము సహింపఁగల్గిరి. కాని యంతకంత కవి యధికమగుచుండుటచేత ప్రజ లాయుదంతము రాజునకుఁ దెలియఁజేసిరి. రాజు మిక్కిలి ఖిన్నుఁడై తనసుతునకు బుద్ధులు గఱపుచు వచ్చెనుగాని ఆతని ప్రయత్నము లన్నియు నడవిఁగాచిన వెన్నెలవలె నిష్ఫలంబులగుచుండుట చేత విసిగి, కొడుకను నభిమానము మాని వాని సగరమునుండి వెడలఁగొట్టించెను. పురజనులు సంతసించిరి.

ఈ యసమంజునకు అంశుమంతుఁడను కుమారుఁడొకఁ డుండెను. ఈతఁడు తండ్రివలె దుర్మార్గుఁడుకాక సజ్జనహితుఁడై, ప్రియవచనముల నాడుచు ధైర్యసాహసములు కలవాఁడై, సకల సద్గుణములచే నొప్పుచు సగరనగరంబునఁ బెరుగుచుండెను.

ఇట్లుండఁ గొంతకాలమునకు సగరనృపతి యజ్ఞంబు

సేయ నిశ్చయించెను. హిమవత్పర్వతంబునకును వింధ్యమహీధరంబునకును నడుమనుండు ప్రదేశము దీని కెంతయుఁ దగిన పుణ్యతలమని తలఁచి యచట యజ్ఞంబు సేయ సమకొని దీక్ష వహించి, యజ్ఞయాశ్వంబును గాచియుండుమని మనుమఁడగు అంశుమంతుని యోగించెను. ఆతఁ డంతట నాయుధపాణియై యశ్వమునుఁ గాచియుండెను. ఇట్లుండ నింద్రుఁడు రాక్షసరూపధారియై సవనప్రదేశమున కేతెంచి యంశుమంతుండు కన్ను మొఱగి నిలిచియుండుతఱి నా తురంగంబును దస్కరించికొనిపోయి పాతాళలోకంబున ఇనునివలె ప్రభాసమానుండై తపోనియతియందున్న కపిల మహామునిచెంగట నా యశ్వంబునుఁ గట్టివైచెను.

అంశుమంతుఁ డింతలోఁ గన్నులల్లన విప్పిచూడ యశ్వంబు కానఁబడదయ్యె. దాని కాతఁడు చింతించి పరిసరప్రదేశముల నంతయు వెదకి వేసారి దాని నెందునుంగానక యాజ్ఞీకులతో నా యుదంతంబు తెలియఁజెప్పె. ఉపాధ్యాయగణంబు సగరమహారాజు పాలికింబోయి "మహారాజా! అశ్వంబు నెవ్వరో ముచ్చిలించిరి. ఆముచ్చులఁ దెగటార్చి యశ్వంబుఁ దెచ్చువఱకును యజ్ఞంబు నాపవలసియున్నది. కావున నందునకుఁ దగినవారల వైళం బఁబనుపుఁడు' అని చెప్ప నా నృపపుంగవుఁ డచ్చెఱువంది తన యఱువదివేవురు పుత్రులం బిలిచి "సుతులారా! యజ్ఞీయాశ్వంబు నెట్లో మేమఱితిమి. చూడంజూడనిది రాక్షసమాయగాఁ గనుపించు

చున్నది. నేనును మనుమఁడును దీక్షితులమై యున్నవారము. యజ్ఞమభిమంత్రితమై యుంటచేమే మిం దుండవలసి యున్నది. కావున మీరు మర్త్యలోకం బంతయు వెదకి, అట లేకుండెనేని అనిమిషలోకంబునఁ బరిశీలింపుఁడు.

తురగంబచ్చట దొరికెనా సరి లేదేని మీలోఁ బ్రతి యొక్కఁడును ఒక్కొక్క యోజనమువంతున ద్రవ్వుచుఁ బోయి గుఱ్ఱ మప్పటికిని గనఁబడనియెడల

కం. పాతాళలోకమంతయు,
బాతిగ శోధించి హయముఁ బరికించియు
బ్రీతిగ నాతురగముఁ గొని,
యేతెండని స్వస్తివాదమిచ్చుచుఁ బనుపన్.,

ఆయఱువదివేవురుసుతులు సంతుష్టాంతరంగులై హాహా రవంబులు మిన్నుముట్టుచుండ భూమియంతయు నదరునట్లు పరభసంబుగా గృహంబుల కేతెంచి వలయు నాయుధంబులం గొని గుఱ్ఱమును వెదుకఁ బోయిరి.

సగరపుత్రు లఱువదివేవు రిట్లు బయలుదేరి మహాసంరంభమ్మున యజ్ఞీయాశ్వంబును వెదుక మొదలిడిరి. వీరి పాద ఘట్టనల ధాటికి ప్రాణికోటి కలవరపడఁజొచ్చెను. వేనవేలు జంతువులు వీరిపాదములక్రిందఁబడి మడిసెను. అశ్వంబు వెదకు నెపంబున నీదుండగీఁడులు నగరంబుల సొచ్చి ప్రజల హింసింప మొదలిడిరి. గృహంబులకు నిప్పంటించి వానిఁ బరశురామప్రీతి గావించిరి. వనాంతరముల నాకురంగంబును

దాచియున్నారని చెప్పుచు రామణీయంబులగు నారామంబుల రూపుమాపిరి. వీరిట్లు ప్రపంచమునంతను ధ్వంసము చేయుచు గుఱ్ఱమును వెదకిరికాని యది కాన్పింపదయ్యె. వారందులకుఁ గుపితులై యశ్వంబు లెవ్వరో భూమియందు దాచియుండనోపుదురని తలంచి, పైభాగమున వెదకుటచే నుపయోగంబులేదని యోజించి భూతలంబును బెకలింప నిశ్చయించిరి.

దీనికై వలయు పరికరములఁ బ్రోవుజేయఁజొచ్చిరి. పర్వతములనయితము భేదించు వజ్రాయుధమువంటి పదునైన గడ్డపారలను, వాడియైన జికాసులు పారలు మొదలగు సాధనంబులను కోట్లకొలది ప్రోవుచేసికొని తమ భుజసత్వము నంతను వినియోగించుచు భూమిని బెల్లగింప మొదలిడిరి. పెద్దపెద్ద శిలలుఁగూడ నూడఁబెరికి పిండిపిండిగఁగొట్టఁజొచ్చిరి. వారిచే బెల్లగింపఁబడిన మన్ను కొండలవలె రాసులు రాసులుగ నేర్పడెను. ధూళి నభోంతరాళమంతట నావరింపఁ బట్టపగలే చీకటు లన్నిదిశల వ్యాపించెను. సూర్యునిసహిత మీ దురాత్ములు నిర్మూలించిరని ప్రజలు భయాకులత నొందిరి. మొదటఁ దప్పించుకొనిపారిపోయియుండిన ప్రాణులకుంగూడ నెమ్మది కలుగదయ్యెను. భూమియంతయు సగరపుత్రహతకులచే గుద్దలింపఁబడుచుండ దాని నాసించుకొని బ్రతుకు జీవకోట్లకు బ్రతుకెట్లు సాధ్యమగును ?

సగరసుతులలో నొక్కొక్కరు ఒక్కొక్క యోజన

మవలీలఁ ద్రవ్వుటచేత శీఘ్రకాలంబున నఱువదివేల యోజనంబుల రంధ్ర మేర్పడెను. నాగలోకంబును సమీపించు వఱకును ద్రవ్వుచు అంతవఱకును అశ్వంబుజాడ గానక వేసారితండ్రియొద్దకు మరలి తండ్రీ! దేవదానవపిశాచరాక్షస గణంబుల నెల్లఁ ద్రుంచుచు, జగతీచక్రంబునంతటను ద్రవ్వితిమి. మఖాశ్వం బెచ్చటను గన్పడినదికాదు. దానిజాడయైనం బొడఁగాంచమైతిమి. మమ్మిఁక నేమిచేయుమనెదరో శెలవిండు, అనిసుతులుపల్క అశ్వంబురానికారణంబున రాజాగ్రహాయత్తచిత్తుండై

కం. నాకముననున్నఁ బన్నగ
లోకంబుననున్న నబ్ధిలోపలనున్నన్
లోకాలోకము కడపటి
లోకంబుననున్ననైన లోకులు మెచ్చన్.'

తురగాపహారునిఁ బోరిఁగొని తురగమును వేవేగఁ దెండ"ని చెప్ప వారరిగి రసాతలముదాఁక ద్రవ్వమొదలిడిరి. మొదట దూర్పుదెసభూమిని ద్రవ్విత్రవ్వి కడపట దిగ్గజంబగు విరూపాక్షద్విపశ్రేష్ఠంబును గని దానికి నమస్కరించి యట తురంగంబును గానక తక్కిన దిక్కులం గలయం ద్రవ్వి దక్షిణంబున బర్వతాకారంబై సకలభూమిం ధరించియున్న యమ్మహాపద్మంబను దిగ్దంతావళంబును, బశ్చిమంబున సౌమనంబను దిశాగజంబును, ఉత్తరంబున భద్రంబను నాశాద్విపంబును నాలోకించిక్రమంబునం బ్రదక్షిణపూర్వకంబుగా నమస్కరించి

అటమీద నీశానభాగంబు ద్రవ్వి ముందట నిమీలితనేత్రుండై తపంబుచేయు కపిలమహామునిం గని యాతనిచెంత యజ్ఞీయాశ్వంబుండుటం బొడగాంచి యాతఁడు తమ తురంగంబును దొంగిలించి కపటవేషంబును దాల్చిన మునిముచ్చని తలంచి ఆగ్రహాయత్తచిత్తులై పండ్లు పటపటఁగొఱుకుచు తమ యాయుధంబుల జళిపించుచు వికారంబుగ నఱచుచు రాళ్ళఱువ్వుచు యోగపరవశుఁడైయుండు కపిలుండాయఁజొచ్చిరి.

చ. ఎఱిఁగితిమద్దిరయ్య! తడవేటికి? గుఱ్ఱపుదొంగబంటు నీ
జఱభునిఁబట్టి చంపుఁ డతిసాధుమునీంద్రుఁడపోలె నేత్రము
ల్దెఱవక జాకినోరు మెదలింపక బైసుకపట్టెనంచు న
య్యఱువదివేవురున్ నిజకరాయుధముల్ ఝళిపించి
డాయుచోన్.

చ. కపిలుఁడు నేత్రముల్ దెఱవగాఁ దమమేనులమంటపుట్టి తా
రపగతధైర్యులై పడియఘాళికతంబున మూఢచిత్తులా
నృపసుతులందఱుం ధరణిసీరయి రాక్షసమంద సాధులం
దపసులఁ గాసిపెట్టెడి మదస్ఫురితాత్ములు నిల్వనేర్తురే?

సగరసుతులిట్లు కపిలుని కోపానలంబున భస్మీభూతులై పడియుండ దనసుతులేలకో మరలక తడసిరని సగరుఁడు చింతింపుచుండి తుదకు మనుమఁడగు అంశుమంతునిం బిలిచి నాయనా యజ్ఞీయాశ్వంబును దెచ్చుటకై వెడలిన పుత్రులింకనురాక తడయుటకేమి కతంబో తోఁపకున్నది. దీక్షవహించి యిపుడు జన్నంబుమానుట మనబోటి క్షత్రియులకు

బాడికాదు. కావున ధనుర్ధరుండవై వెదలి మఖాశ్వంబును వెదకి తురగాపహరుం వధించి వేవేగ యజ్ఞీయాశ్వంబును దెచ్చి నేఁదలపెట్టిన యజ్ఞంబును సంపూర్తియగునట్లు చేయుము" అని చెప్ప

మ. ఘనసత్వుండగు నంశుమంతుఁడు ధనుఃఖడ్గాస్త్రమున్ పూనియే
పునఁదండ్రుల్ మునుద్రవ్వుచుం జనినయాభూపద్ధతిం బోయి తూ
ర్పునదిగ్దంతినిగాంచి యక్కరిపదంబుల్ ముట్టుచుఁ మ్రొక్కి మ
జ్జనకుల్ వచ్చిరె, వారిఁగావవె? మఖాశ్వంబుఁ నిరీక్షింపవే?

యని దైన్యంబున నడుగ దైత్యవిహంగ భుజంగపిశాచ దేవపూజనముల నొందు నాదంతి అంశుమంతునిం జూచి రాజనందనా! కృతార్థుఁడవై తురగంబుఁగొంచుఁ జయ్యనఁ జనుదెంచెదుగాకయని దీవించెను. పిదప నతఁడు సమస్తదిగ్గజంబులకుఁ బ్రదక్షిణపూర్వకంబుగా నమస్కరించుచు ఆదిగ్గజంబులఁ బితృమఖాశ్వంబుల సుద్దులడిగి వారిచే దీవనలం బొంది ముందునకువఁ జొచ్చెను. ఇంతలోఁ మఖాశ్వంబు కానంబడియె. దాని డాయంబోయి సమీపంబుననున్న భస్మరాసులఁజూచి యవి పితృభస్మరాసులని తెలిసికొని దుఃఖంబు బట్టఁజాలక విలపింపఁ దొడఁగెను. కాలక్రమంబున మనంబు గొంతగుదుటఁబడ పితృవర్గంబునకుఁ దిలోదకంబు

లియ్య నొకకాసారంబు నెమకుచుండఁ దన పితృమాతులుండగు గరుత్మంతుం డాతనిగాంచి యాతనిఁ జేరంజీరి దయారసంబుప్పతిల్ల "అయ్యా దుఃఖించుటవలన నేమిప్రయోజనము! నీపితృవర్గము శ్రీమన్నారాయణ స్వరూపుండగు కపిలుని కోపానలంబుచే భస్మీకృతంబయినది. ఇది దైవికంబగుటచే వగవం బనిలేదు. నీవిప్పుడియ్యదలచుకొన్న జలంబులచే నీపితృవులకు నాకలోకప్రాప్తి పొరయనేరదు. పరమపావనియగు గంగ నమరలోకమునుండి తెచ్చి యానదీజలంబుల నీభస్మరాసులఁ దడిపితివేని నీపితృలకు సురలోకప్రాప్తియగునని చెప్పి గరుడుఁ డంతర్హితుండయ్యె.

అంశుమంతుండు మరలి భస్మరాసుల సమీపంబున నొకవృక్షంబునీడన నిష్టాపరుండయి తపంబుసేయుచు చండకిరణమార్తాండునివలె వెలుంగుచుండు కపిలమహామునింగాంచి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి నిలుచుండ నింతలో నమ్మహామహుండు తపంబుచాలించి కన్నులల్లనవిచ్చి చూచి, తనయెదుట వినమితోత్తమాంగుండై నిలుచుండియుండు రాజపుత్రుంగని యోగబలంబున నాతని యభిమంతం బరసి దయాంతరంగుండయి

కం. గుఱ్ఱము గొనిపోబుద్ధుల
కుఱ్ఱఁడ మీతాతనొద్దకున్ నీతండ్రుల్
వెఱ్ఱులు, నీవైరవె, యీ
మిఱ్ఱున గంగాజలంబు మొలఁగ శుభమగున్

అని దీవించిన నంశుమంతుండు నమస్కరించి తురంగంబుఁ గొనివచ్చి సగరునికిచ్చి కపిలుని వచనంబుల నెఱింగించిన సగరుండు పుత్రశోకం బుడిగి యశ్వమేధంబుచేసి సముద్రుం దనకుఁ బుత్రుగాఁ గల్పించిన నదిమొదలు సముద్రంబు సాగరంబు నాఁబరగె.

సగరుని తరువాత అంశుమంతుండు రాజ్యంబు క్రమంబుగానేలి జనకులు మ్రగ్గినచోటికి గంగను దేవలయునని తపంబుచేసి యసువులఁబాసె. పిదప ఆతనితమ్ముండగు దిలీపుండుకూడఁ దపోనిరతుండయ్యెను. గాని కొలదికాలములో నతఁడు సయితము గాలధర్మము నొందెను. పిమ్మట నీతనిసుతుండగు భగీరథుండు రాజ్యాభిషిక్తుండై కొంతకాలంబు రాజకార్యంబుల నిర్వర్తించుచు సుతులులేని కొఱఁత యాతనిఁ బ్రేరేపింప రాజ్యభారంబు దనమంత్రుల కప్పగించి, తుహినాద్రికిం జని భయంకరంబగు బిలంబుసొచ్చి యట ఘోరతపంబుసేయ గంగ యాతనిదృగ్గోచరంబయ్యె. అంతట నామెకు బ్రదక్షిణ నమస్కారంబుసేసి

ఇంద్ర॥ చెల్లన్ మదిన్ నిన్నుభజింతు గంగన్
ఫుల్లత్తరంగన్ బహు పుణ్యసంగం
గల్లోలలక్ష్మీజితకాశమల్లిం
దల్లిన్ సుధీకల్పలతామతల్లిన్.

అని వినుతిసేయు భగీరథుంగని యా పరమపావని వత్సా! వరంబు వేడుమనిన,

కం. మీవారిభస్మరాసుల
నీవారింగలపికొనుము నెఱిమావారల్
నీవారిఁ గలయనాకము
మావారికిఁ గలుగునిది ప్రమాణము, దల్లీ!

అని రాకొమరుండు ప్రార్థింప,

మ. వినువీధిం బఱతెంచినేలఁబడు నావేగంబునన్ నిల్పనో
పినవాఁ డెవ్వడు? మేదినీతలము నే భేదించి పాతాళముం
జనుదున్ వచ్చితినేని, నాజలములన్ సంస్నాతులై మానవుల్
ననుఁబొందించు నఘవ్రజంబెచట నేనాశంబుఁ బొందించెదన్?

అనుచు సంశయాకులచిత్తయై పలుకు నగ్గంగామతల్లికిం బ్రణమిల్లి 'మాతా!

మ. పరతత్త్వజ్ఞులు శాంతచిత్తులు తపఃపారీణులార్యుల్ ఘనుల్
పురుషశ్రేష్ఠులు వచ్చి, తల్లిభవదంభోగాహముల్ సేయఁగా
నరసంఘాఘము నిన్నుఁబొందునె? జగన్నాథుండు నానాఘ సం
హారుఁడావిష్ణుఁడు వారిచిత్తములఁదానైయుంటమందాకినీ!

తల్లీ! నీవారి న్నివారింపనోపినవాఁ డొకఁడు పరమేశ్వరుండు కావున ఆతనిఁగూర్చి యుగ్రతపంబుసల్పి యమ్మహామహుని నిందుల కొడంబఱచెద. పోయివచ్చెద" నని చెప్పి భగీరథుఁడు కైలాసశిఖరంబునకుఁ జని విజనంబైయుండు

నచ్చోట నిరాహారంబులువదలి యుగ్రతపంబునకుఁ బూనెను. భక్తవత్సలుండును ఆర్తశరణ్యుండును నగు నాశితికంఠుండు భగీరథునకుఁ బ్రత్యక్షమై "వత్సా నీతపంబునకుఁ మెచ్చితి. నీవడిగిన వరం బిచ్చెద'నన "మహానుభావా? మత్పితృవులు సుగతి నొందఁగోఱి తపంబుసేయ గంగ భూలోకంబునకు రా నిచ్చగించె. కాని యమ్మహానదం ధరియింపఁగల సత్వ సంపన్నుండు లేమింజేసి మిమ్ముంగూర్చి తపంబునల్పితి. నా విన్నపం బాలకించి వియద్గామినిందాల్ప సమ్మతింపు"డన శివుండు దరహాసితవదనుండై "భగీరథా! అట్టులే కానిమ్ము. నీవు భూలోకంబునకు గంగావతరణంబు సేయుము. నేనా గంగన్ ధరియించెద" నని చెప్పెను. భగీరథుండు గంగ నారాధింప నామెకరుణించి,

మ. ఇలకున్ గంగతరంగసంహతులతో నేతెంచె నాకాంతరం
బులు నాకాశముఁ గప్పుచుండగమహాభూతప్రపంచంబుతోఁ
జెలువై యుండఁగ దాని నీశ్వరుఁడు దాల్చెన్ సాంగతో
త్తుంగ పిం
గళజూటాగ్రమునందుఁ బద్మదళసంకాశంబుగా లీలతోన్.

ఇట్లు హరుజూటంబుఁ బ్రవేశించి యాతని నతిక్రమించి గగనాపగపన్నగలోక మేగ వేగిరపడఁ జూచి శంకరుఁడు కినుకఁబూని దానిం బోనియ్యక బిగియఁబట్టుటచేత నాగంగ హరుని కపర్దకందరమునఁ జాలకాలము తిరుగుచుండెను. ఇట్లు నిరోధమై భ్రమించు గంగవలనఁ దన మనోరథం

బీడేరమికిం జింతించుచు భగీరథుండు మరలి శివునింగూర్చి తపంబాచరింప నమ్మహాదేవుండు సంతుష్టహృదయుండై జటాకుహరంబుననున్న గంగను కైలాసపర్వతశిఖర ప్రాంత్యంబున నుండు బిందుసరోవరసమీపంబున విడువ నంత నాజల మేడు ప్రవాహములయ్యెను. హ్రాదినియు, నలినియుఁ, బావనియు నను మూడుప్రవాహంబులు పూర్వదిక్కునకుం జని యిప్పటి బ్రహ్మపుత్రానది యయ్యెను. చక్షువు, సిత, సింధువు లను మూడు పుణ్యనదులు పశ్చిమమునకుఁ బ్రవహింపఁ జొచ్చి యిప్పటి సింధునది యయ్యెను. అందేడవ నదీవరేణ్యయగు గంగ మహారథుండగు భగీరథునివెంట దక్షిణంబునకు నేతేరం జొచ్చె.

ఉన్నతనగాగ్రసీమలం దిట్లుద్భవించిన గంగ క్రిందికి దిగునపుడు మిక్కిలి వేగముగ బ్రవహించుచు రాళ్ళనుసయి తము నీడ్చుకొనిపోవుటయు స్వాభావికముగదా! కాన మన పూర్వీకు లీనది శితికంఠునిరోధంబు కారణంబుగాఁ గోప ఘూర్ణితమానసయగుచు, చంగుచంగున మింటిమీఁది కెగసి నల్లెగసి, రంగదుత్తుంగ భంగిభంగరఘునోదనబిందువు లెగయ, భగీరథకీర్తివల్లులుంబోలె ఫేనమాలికలు గ్రాల, విక్రమశాలి యైన భూపాలుండునుంబోలెఁ బరభూము లొత్తుచు, భార్గవ రాముండునుంబోలె భూభృత్కూటంబులు వీటతాటనంబులు చేయుచు నదభ్రగంభీరధ్వని మ్రోయుచు నది త్వరితగతిం బఱతెంచుచు ముందట,

మ. అమరన్ జహ్నుఁడు నిష్ఠతో మఖము సేయన్ రంగ
దుత్తుంగ భం
గములుద్యద్గతిఁ బెల్లుగా నడరి వీఁకన్ వచ్చి యయ్యజ్ఞవా
టము సర్వంబును ముంపనప్పు డతి చండక్రోధ దుర్వార వే
గమునన్ జహ్నుఁడు ద్రావె నద్భుతముగా గంగాజలం
బంతయున్.

అపుడు సురముని గంధర్వాదు లచ్చెరువంది జహ్నునిం బ్రార్థించిరి. భగీరథుం డా మునిసత్తమునకుం బ్రణమిల్లి, మహానుభావా! గంగనిట్లు మీరు నిరోధించుటచే మాపితృవర్గంబునకు మోక్షంబు దూరంబగు. కాన కరుణించి యమ్మహాభాగినిం వెడలింపుమన నా యోగి సత్త్వుండు సమ్మదమునఁ దనఘనకర్ణరంధ్రమున నానదిని వెడలించెను. అప్పటి నుండియు గంగ జాహ్నవియనం బరఁగె.

ఇట్లు జహ్నుకర్ణకుహరాగ్రమునుండి వెలువడినగంగ భగీరథుని వెంట దూర్పుముఖంబుగా బ్రవహించి సముద్రంబు జేరి దానిజలంబులతో నింపి, అందు సాగరులచే ద్రవ్వఁబడిన బిలంబులఁ బాతాళలోకంబునకుం బోయి యట భగీరథుని ప్రపితామహభస్మరాసులఁ దనపావనజలంబుల సంసిక్తంబు సేసె. అపుడు సర్వలోకపితామహుండగు పితామహుండు వచ్చి భగీరథుంజూచి యిట్లనియె.”

“పుణ్యమూర్తివగు నీవలన సగరసుతు లందఱు స్వర్గ

ముఁ బొందిరి. నీ కారణంబున మీ వంశమంతయుఁ బవిత్రమయ్యెను.

ఉ. గారవమార నీ దివిజగంగ భవత్సుతయై తగంగ భా
గీరథి నాఁగ నొప్పెడు భగీరథభూపతి లోకపావనో
దారసుకీర్తి నొంది త్రిపథంబుల నిట్లుఁ గమించెఁ గాన పెం
పార ధరిత్రిలో ద్రిపథగాహ్వయయై విలసిల్లెడున్ గడున్.

పూర్వకాలమున పూర్వికులు తమకు మహోపకారమొనర్చు పంచభూతములకును బ్రకృతియం దద్భుతముగ గన్పడు మహీధరములు, నదులు మొదలైనవానికిని దేవత్వమారోపించి వానిని బూజించుచుండిరి. ఇవన్నియు బ్రకృతిధర్మమునకనుగుణ్యముగ వర్తిల్లుననియు వీనిని సృజించిన పరమేశ్వరుని యంశ వీనియం దెక్కుడుగ నుండుటచేత తమ కుత్పత్తిలయముండినను వానికి లేవని తలంచి వానియెడల భక్తితో మెలఁగుచుండిరి. ఋతుపవనముల వెంబడివచ్చిన సముద్రపునీటియావిరి ఘనీభవము నొంది పర్వతాగ్రములందు మేఘమై వర్షరూపమున గురియుటఁ జూచి యా తెలిమంచు గంగామహాదేవియొక్క ధవళాంబరమని వారు భ్రమించిరి. ఆకాశము నంటియున్నట్లగుపడు తుహినాద్రిశృంగములు మేఘములనైవుఁ జూచు పరమేశ్వరుని వదనమని తలఁచిరి. ఆ భూధరంబునఁ బెచ్చు పెరిగియుండు కాంతారాంతరంబులు పరమేశ్వరుని జటాజూటములని వారికిఁ దోఁచెను. ఇందుచేతనే గంగ నింగినుండి కైలాసపర్వతమున నుండు శివుని జటాజూటమున దిగెననియు, అచట


మాహేశ్వరునిచే నిరోధింపఁబడినదనియు, ఆమె కోపముతో మహావేగమున పర్వతప్రదేశమునుండి క్రిందికి దుమికెననియు మన పురాణములు చెప్పుచున్నవి. ఈ భావము ప్రకృతికి విరుద్ధమైనను ఆర్యుల కల్పనాశక్తి యమోఘమని జూపుచున్నది.

ఇందుగలఁ డందు లేడని
సందేహమువలదు చక్రిసర్వోపగతుం
డెందెందు వెతకిచూచిన
నందందే కలఁడుదానవాగ్రణివింటే.

యని విశ్వసించు భారతీయులు అద్భుతంబుగఁ గన్పడు ప్రతి భౌతిక పదార్థమునందును విరాట్స్వరూపునిఁ బొడఁగాంచుట సహజమనియే చెప్పవలసియున్నది.

6. పర్వతదశ

గంగానది నిజముగాఁ గైలాసశిఖర ప్రదేశంబుననుండు గంగోత్తరీ హిమానీనదమున నుత్పత్తియై యటనుండి భగీరథి యను నామంబునఁ గొంత దూరము ప్రవహించి యొక కందరము (జహ్నుమహాముని) బ్రవేశించి యట మరుగుపడుచున్నది. ఈబిలముపై హిమ మత్యధికముగ నుండుటచేత అదికరఁగి నీరై యన్ని పార్శ్వములనుండి సెలయేరులుఁగా బారుచుండఁ, గోముఖరూపంబున గాన్పించు నా బిలద్వారమునుండి ఆ మరుగుపడిన ప్రవాహము వెలువడుచున్నది. ఇచట నీ నది 27 అడుగుల వెడల్పు గలిఁగి 15 అంగుళ



గంగోత్రహిమానీనదము

ముల లోతుగలదై సముద్రపు మట్టమునకుఁబైన 13500 యడుగుల యెత్తునఁ బ్రవహించుచున్నది. ఇక్కడనుండి యీ నది రాతినుండి రాతిమీఁదికి దుముకుచుఁ జిన్నచిన్న రాళ్ళ మిగుల నార్భాటముగా నీడ్చుకొని పోవుచు, క్రోధ కలుషితయయి నట్లు ఫేనశకలములఁ గ్రక్కుచుఁ బర్వతము నుండి క్రిందికి వడిగాదుముకుచున్నది.

భగీరథి యిట్లు క్రిందికిఁ బ్రవహించుచుండ ప్రయాగ యొద్ద దీనితో అలకనందానది సంగమ మగుచున్నది. ఇది భగీరథికంటెఁ బెద్దది. ఎక్కువ నీటినిఁగూడఁ దెచ్చుచున్నది. కావున శాస్త్రజ్ఞులు గంగానదియొక్క శిరఃప్రవాహ మది యనియే చెప్పుదురు కాని సామాన్యజనులు దీనిని గంగ కుపనదిగా భావించుచున్నారు. ఈనది మొదట బదరీనాథము లోని హిమానీనదముల నుత్పత్తియై విష్ణుగంగ యను నామంబునఁ గొంత దూరము ప్రవహించి, విష్ణు ప్రయాగ దాటినతరువాత కర్ణప్రయాగవఱకుఁ బారి అచట పడమటికిఁ దిరిగి, కేదారనాథమునుండి దక్షిణముగాఁ ప్రవహించెడు మందాకినీనదితో రుద్రప్రయాగయొద్ద సంగమమయి అలకనంద యను నామంబున గంగలోఁ గలియు చున్నది.



గోముఖము

తరువాత నేబదిమైళ్ళదూరమున హృషీకేశాశ్రమము పజ్జనీనది ప్రవహించును. ఈ గ్రామము గంగానది యొక్క కుడిగట్టున నున్నత నగాగ్రమునఁ గట్టఁబడి చూచుటకుఁ రమ్యముగ నున్నది. ఇది పర్వతప్రదేశ మగుటచేతను చలి యధిక మగుటచేతను ఇచట ప్రయాణము కొంచెము కష్టముగనుండును: అయినను భక్తులీశ్రమను లక్ష్యము చేయక వేలకొలది యచ్చటికి వెళ్ళుచుందురు. హరిద్వారమునకు వెళ్ళు యాత్రికులలో దాదాపుగా నంద ఱిచటికిఁ బోవువారలే. వీరలలోఁ గొందఱుమాత్రమే బదరికాశ్రమమున కేగి బదరినారాయణ సందర్శనపుణ్యఫలంబు సంపాదింప గలిగియుందురు. మిగిలినవా రందఱు హృషీకేశము మొదలు లక్ష్మణజూలా (వంతెన) వఱకునుండు క్షేత్రములఁజూచి మరలుచుందురు.

హృషీకేశము ప్రసిద్ధిచెందిన క్షేత్రములలో నొకటి. ఇచట భరతాలయము ముఖ్యమయినది. రావణాసురుని సంహరించుటచే గలిగిన పాపమును బోగొట్టుకొనుటకై లక్ష్మణుఁ డిట తపంబుచేసెనని స్థలపురాణముః చెప్పుచున్నది.

అన్ని క్షేత్రములందువలె నిచ్చటకూడ సాధువు లనేకులుమూగియుందురు. వీరు నదిగట్టునసిసుకమీఁదఁ బూరిగుడిసెలలో నివసించుచున్న ఆ తెలినీట మజ్జనమాడి ధర్మశాలల నుండి తమ కేతెంచు నాహారముతో దేహవాంఛలఁ దీర్చుకొని హరినామస్మరణ జేయుచుఁ గాలముఁ గడుపుచుందురు.

హృషీకేశమునుండి గంగామతల్లి క్రిందికిఁ బారుచు జన్మస్థానమునకు రమారమి నూటయెనుబదిమైళ్ళ దూరమున నుండు హరిద్వారముఁ జేరునప్పటికి సముద్రమట్టముపైన 13,800 అడుగుల యెత్తునుండి 2000 అడుగుల యెత్తుప్రదేశమునకు దిగియుండును. కావున నీ నదీప్రవాహవేగ మత్యధికమనియు, దానిచేత నడుమ నచ్చటచ్చట అగాధములైన మడుగు లేర్పడియుండుననియు, మిగతభాగములందు రాళ్ళుగుండ్లుండుననియుఁ జెప్పకయె తెలిసికొనవచ్చును. ఈదశయందు శిథిలమగుచుండు వండుమంటినే గంగానది సమభూతలములకు నిచ్చుచుండును.

హృషీకేశమునుండి హరిద్వారమువఱకు జక్కని దారి వేయఁబడియుండుటచేతను, ప్రక్కన ధర్మశాలలు కట్టబడియుండుటచేతను అక్కడక్కడ వసతిగనుండునూతులుత్రవ్వబడియుండుటచేతను, ఈ ప్రయాణ మిపుడు సులభముగ నున్నది. ఇకారణమున భక్తులనేకు లిచటికి శ్రమలేకయే పోవుచుందురు.

మిక్కిలి యెత్తైన హిమాచలశిఖరంబుల నుత్పత్తియైన గంగానది క్రిందికి వేగముగ దుముకుచు ఆపర్వతరాజపాదప్రదేశమునుండు శివాళికపర్వతమును భేదించుకొని దాదాపుగా నొక్కమైలువెడల్పుగల యాగండిగుండ సమప్రదేశములకుదిగి హరిద్వారము చేరుచున్నది. ఇక్కడినుండియే గంగకు మైదానపుదశ ప్రారంభమగుచున్నది. హరి

ద్వారము పవిత్రస్థలములలో వన్నెకెక్కినది. బదరికేదార
ములు ప్రయాణ కష్టములకు వెనుదీయని కొందఱకే సాధ్య
ములు కాని హరిద్వారమునకు మంచిదారులుండుటచేతను,
క్రొత్తగా నినుపదారియొకటి యేర్పడియుండుటచేతను యాత్రి
కులు లక్షలకొలది యచటికిం బోయి అచటి పుణ్యతీర్థంబుల
గ్రుంకిడుచు మనశ్శాంతి నొందుచుందురు.

హరిద్వారము పురాతనపుణ్యక్షేత్రము. ఒకప్పుడు
దీనికి గంగాద్వారమని పేరుండినది. అంతకుపూర్వము మాయా
పురమని నామాంతరముండినది. పిదప శైవులు శైవక్షేత్రమని
దీనికి హరద్వారనామమిడిరి. విష్ణుక్షేత్రమిదియని వైష్ణవ
భక్తులు హరిద్వారమని పిలువఁజొచ్చిరి. విష్ణుపురాణమున
గంగానది విష్ణుమాహాత్మ్యమున బుట్టినదనియుఁ దూర్పు
నుండివచ్చు అలకనంద శివునిచే జన్మించినదనియు జెప్పఁబడి
యున్నది. అయినను శైవులు శైవక్షేత్రమనియు వైష్ణవులు
వైష్ణవక్షేత్రమనియు నిప్పటికిని వాదులాడుచు యిచటి పట్టణ
మును శైవులు హరద్వారమనియు వైష్ణవభక్తులు హరిద్వార
మనియు వేరు వేఱఁ బిలుచుచున్నారు.

నిజమాలోచించి చూడ హిందూమతంబున శైవ
వైష్ణవశాఖా భేదంబు ఉత్పత్తియగుటకు ముందే యీప్రదేశ
ము పుణ్యస్థలముగాఁ బరిగణింపబడినదని తెలియుచున్నది.
దానిచేత ననాదినుండియు నీప్రదేశము వైష్ణవ శైవులకేగాక
బౌద్ధులకుఁగూడఁ బవిత్రస్థలమయ్యెను. ఇది సత్యమని

నిరూపించుటకుఁ దగినచిహ్నము లనేకము లిప్పటికి నిందందు
కానవచ్చుచున్నవి. ఈపట్టణమునకుఁ గపిలస్థానమనికూడ
నామాంతరము కలదు. కపిలుఁ డిచ్చోటఁ దపముచేయు
చుండెనని అచటి వారిప్పుడును ఒకస్థలమును జూపించు
చున్నారు.

ఈపురమున దేవాలయములు మెండుగా నున్నవి.
మాయాదేవి యాలయమిందు పేరొందినది. దీని ద్వారబం
ధముమీఁదఁ జెక్కబడియుండు శాసనమునుబట్టి చూడ
నీదేవాలయము పదియవశతాబ్దమునుండియు పేరుగాంచి
యుండినట్లు విశదమగుచున్నది. ఇందు మూడుతలలు నాల్గు
హస్తములు గల శిలావిగ్రహ మొకటికలదు. ఈవిగ్రహము
యొక్క యొకహస్తమునందు చక్రముకలదు. రెండవదాని
యందు మనుష్యుని శిరమును బోలినదొకటియు, మూడవ
చేతఁ ద్రిశూలమును కానవచ్చుచున్నవి. నాల్గవహస్తమున
నొకకత్తిని బట్టుకొని నేలబడియుండువాని నొకని వధించు
చున్నట్లగుపడుటచేత నీవిగ్రహము దుర్గాదేవి విగ్రహమువలె
గానవచ్చుచున్నది కాని బుద్ధునితల్లియగు మాయాదేవి
యొక్క ప్రతిమ యనుటకు వీలులేదు. సమీపమున శారనా
ధాలయంబున బోధివృక్షంబుక్రింద బుద్ధుఁడు సమాధినున్నట్లు
చూపు విగ్రహముకలదు.

అన్నిటికంటె నెక్కువగ జనుల నాకర్షించునది హరిపాద
ము. ఇది హరిద్వార దేవాలయము ప్రక్కననుండు స్నాన

ఘట్టమున నొకరాతిమీఁదఁ జెక్కఁబడియున్నది. భక్తవత్సలుఁడగు శ్రీమహావిష్ణువుయొక్క కాలిగుర్తుగా నెంచి దీని వేలకొలది జనులు కన్నులనొత్తుకొనుటకై వెళ్ళుచుందురు. వైశాఖమాసంబున బుధుఁడు కుంభరాసిఁజేరిన దినము గంగభూలోకమున నవతరించిన సుదినమని యెంచి యానాడు కుంభోత్సవమిచటఁ జేయుదురు. అపుడు లక్షలకొలది తైర్థికులేతెంచి యాపావనజలంబుల స్నానముచేయుదురు.

గంగానది శివాళికపర్వతంబును బగులఁ దీసికొని క్రిందికి దిగునపుడు అదియొక ప్రవాహముగా దుముకక అనేక శాఖలగుచున్నది. వీనినడుమ వెల్లువలకాలమునఁగూడ నీట మునుఁగని ద్వీపములు కొన్ని యేర్పడియున్నవి. ఈశాఖలలో నొకటి హారిద్వారమునకుఁ బైభాగమున రమారమి రెండు మైళ్ళదూరమునఁ బ్రారంభమయి హారిద్వారముప్రక్కన బ్రవహించి కొంతదూరమున మరల మొదటిప్రవాహములోఁ గలియుచున్నది. ఈశాఖనుండియే గంగకాలువ (The great Ganges Canal) యొక్క శిరఃప్రవాహము వెడలుచున్నది. హిమాలయమున మంచుగడ్డలు కరగుటచే నేర్పడిన జలములో దాదాపుగా నంతయు నీకాలువగుండ బ్రవహించి పరిసరప్రదేశముల ఫలవంతముగ చేయుచున్నది.

ఈకాలువగట్టున కాంఖల్ అను గ్రామమొకటి యున్నది. దీని చేరువ పురాణప్రసిద్ధమగు దక్షప్రజాపతి దేవాలయ మొండుకలదు. సమీపమున సతీకుండ మున్నది. వీనిం

జూచుటకు యాత్రికు లెందఱో పోవుచుందురు. ఇవి యీ క్రింద వివరింపఁబడిన పురాణేతిహాసమును యాత్రికులకు జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి.

చాలకాలముక్రిందట నీప్రదేశమునకు దక్షప్రజాపతి నాయకుఁడుగా నుండెను. ఆయనకుఁ బదియార్వురు కూఁతురులుండిరి. అందుఁ బదుముగ్గుఱ నాతఁడు ధర్మరాజునకిచ్చి వివాహముచేసెను. ఒక్కకన్య అగ్ని దేవునకు భార్యయయ్యెను. మఱియొకతె పితృదేవతల పత్నియయ్యెను. కడపటి కూఁతురగు సతి జరామరణనివర్తకుండగు అభవుని యిల్లాలయ్యెను. వీరందఱిట్లు తమ పతులయింటఁ గాపురముచేయుచుఁ బుత్రవతులై యుండిరి. సతీదేవికి మాత్రము సుతులులేకుండిరి. అయిన నామె తనపతిని సతతంబుఁ బూజింపుచు పతినె దైవముగ నెంచుకొనియుండెను.

సుతులులేని సతియెడఁ దండ్రియగు దక్షప్రజాపతికంత ప్రేమయుండినదికాదు. ఇట్లుండ బ్రహ్మలు సత్రయాగము చేయమొదలిడిరి. దానింజూచుటకు దక్షప్రజాపతిపోవ సభ్యులందఱు లేచి నిలుచుండిరి. బ్రహ్మయు, మురారియు లేవకుండుటంగాంచి 'ఆహా! నాకూఁతుం బెండ్లియాడుటచే నాతఁడు శిష్యభావంబు వహించి లేచి నమస్కారంబు సేయకపోయినను నోటిమాటకు గఱవయ్యెనా' యనుచు కోపోద్దీపితుండై శపియించి వెడలిపోయెను. ఆకోపంబు మనసున నుంచుకొని పిదపఁ గొంతకాలంబునకు యజ్ఞముసేయుచు శివునిదప్ప


అన్యదేవతల నందఱి నాహ్వానించెను. వారందఱా యజ్ఞశాలం గూర్చుండియుండిరి. ఇవ్వార్త సతీదేవికిఁ దెలియ నామె భవునింజూచి "మహాత్మా! నాతండ్రి జన్నంబుచేయుచున్నవాఁడట. నాయక్కసెల్లెండ్రందఱు సభర్తలయి వచ్చియుందురు. వారలంజూచు తమకంబునాకగ్గలమగుచున్నదని చెప్పెను. శివుఁడు పోవలదనెను. అయిననామె కడపట శివుని యొప్పించి యజ్ఞంబుచూచువేడుక తండ్రియింటికింబోయెను. తల్లియు అక్కసెల్లెండ్రును ఆమెను సగౌరవముగ సన్మానించిరి. కాని తండ్రి యామెను బల్కరింపఁడయ్యె. దాననామె కుపితమానసయై తండ్రి దన్నవమానించెగదాయను రోసంబున నిజయోగసమాధిజనితంబయిన వహ్నిచేఁ దక్షణంబ దగ్ధంబయ్యె. ఆస్థలమిప్పుడు సతీకుండ మయ్యెను.

ఈ సమాచారము శివునకుం దెలియవచ్చెను. ఆతఁడు రౌద్రాకారుండై హుంకరించు దన జటను క్రోధముతోడ నేలంగొట్టెను. అపుడు సకలలోక భయంకరుండగు వీరభద్రుం డుదయించి దక్షాధ్వరంబు ధ్వంసంబు కావించి శివునకు మనస్సంతోష మొనరించెనట.

7. బదరీకాశ్రమ ప్రయాణము

హిమాలయపర్వతంబున జేరొందిన పుణ్యక్షేత్రములు కొన్ని కలవు. వానిలో బదరినారాయణము, కేదారేశ్వరము భక్తులఁ బులకాంకితులం జేయుచుండును. హిమాలయపర్వతమధ్యంబున అత్యద్భుతమై వర్ణనాతీతమైన స్థలంబున నుండుట

చేత నివి పరమేశ్వరుని అమోఘశక్తినిఁ జూపుచు, భక్తులకు పరమేశ్వరాలయములుగ గన్పడి ప్రతిభారతీయుని నచటి కాకర్షించుచున్నవి. కావున నిచటికేగు తైర్థికుని వెంటనొకయూహాయాత్రచేసి కొంత యానందింతము.



బదరీకాశ్రమమార్గము.

గంగాద్వారమని పేరుగాంచిన హరిద్వారమునకు ఇనుపదారి యుండుటచేత నీ యాత్ర యందఱకును సులభసాధ్యము. కావున లక్షలకొలది యాత్రికులిచటికి సులభముగ వెళ్ళుచుందురు. వారలలోఁ గొందరుమాత్రమే బదరినారాయణుని

సందర్శింప నిశ్చయింతురు. ప్రయాణకష్టమే యిందులకు గారణము.

హరిద్వారము చేరి యచట స్వామిని సందర్శించి బదరినాథమునకుఁ బోవ నిశ్చయించినవారలు హృషీకేశము నకు బోవుదురు. అంతవఱకును రాజమార్గ మున్నది కావున జరుగుబడి కలవారు బండ్లలోఁ బోదురు. అటుమీఁద మార్గ మిరుకగుచున్నది. రమారమి యాఱడుగులకంటె అది యెక్కువ వెడల్పు గలిగియుండదు. అంతియగాక అది సాధారణముగా గంగానది వెంబడియే యున్నను ఒక్కొక్కచోట అడ్డముగనుండు మిట్టపై కెక్కును. మఱియొకచోట నెత్తైన పర్వతభాగమును, చుట్టుకొనివచ్చును. కావున హృషీకేశము నొద్ద కూలివారల నేర్పఱచుకొని యాత్రికులు ముందునకుఁ బోవలసియుండును. నడువఁజాలనివారల మోసికొనిపోవుటకుఁ గూలివార లిచట దొరకుదురు. వీరొక బుట్టకుర్చీపై యాత్రికుని గూర్చుండబెట్టుకొని దానిని దమవీపున కంటఁ గట్టుకొని నడుచుకొని పోవుచుందురు.

ఇట్లు పయనమయిన యాత్రికులు లక్ష్మణఝూలా వద్ద గంగను దాటుదురు. హరిద్వారమునకు సమీపంబున నుండు పవిత్రస్థలములలోనిది యొకటి కావున నిచట తైర్థికులనేకులుగంగాస్నానమాచరించి దేవునిసందర్శించిమరలుచుందురు. కొందఱుమాత్రమె ముందునకుఁ బోవుదురు. బదరినాథయాత్ర యిక్కడినుండియే ప్రారంభ మగుచున్నదని

చెప్పవచ్చును.

ఈ దారియందు క్రోసెడుదూరమున కొక్క విశ్రమ స్థానము కలదు. రాత్రులందును తుపాను లధికముగ వీచు సమయములందును జనులు వీనిలోఁ దలదాచుకొనుచుందురు. వీనికి బాడుగయియ్యనక్కరలేదు కానివలయుపదార్థముల యాత్రికు లిచటి యంగడిలోఁ గొనవలసియుండుటచేత నాయద్దె వారల కందు గిట్టుచుండును.

ఈ విశ్రమస్థానములు పరిశుభ్రముగ నుండుటలేదు. ఎచ్చట జాచినను మాలిన్య ముండుటచేత నిచటి ఈగలు జుమ్మని మూసురుకొనుచుండును. చీరపోతులకును మిన్నల్లులకు మితియె యుండదు. కావున నీ విశ్రమస్థానముల సుఖనిద్రయనునది యసాధ్యముగ నుండును. అయిన భక్తిపరవశులగు యాత్రికు లీ దేహబాధల సఱకుఁగొనక బదరీనారాయణ సందర్శన సౌఖ్యము నాశించి ముందుఁ బోవుచుందురు.

లక్ష్మణఝూలా గడచిన తరువాత నిరువదిమైళ్ళ దూరమున గంగాకందరము (gorge) వచ్చును. ఇక్కడ ప్రక్కలు మిక్కిలి నిట్రములై అగాధముననుండు నీటివఱకు వ్యాపించి యుండును. అడుగున నీరు కళపెళ ఉడుకుచుఁ బ్రవహించుచుండును. ప్రయాణికు లిట్లు కొంతదవ్వరిగిన పిదప దేవప్రయాగమున కేతెంతురు. పంచప్రయాగలలోనిది మొదటిది. ఇచట అలకనందానది భగీరథితో సంగమమగుచున్నది.

కావున నిది యొక పుణ్యక్షేత్రము. అంత్యకాలమున రామచంద్రుఁ డిట తపంబొనర్చుటకుఁ బోయెనని ప్రతీతికలదు కావున నాతని గౌరవార్థమిచట నొక దేవాలయము నిర్మింపఁబడియున్నది.

ఈదేవప్రయాగమె బదరినాథత్ పండా లుండుచోటు. కావున యాత్రికులచుట్టు వారుమూగి "మీ దేయూరు? ఎచ్చటినుండి వచ్చుచున్నార" ని ప్రశ్నించి ఎవరికి సంబంధించినవారల వారు తమ గృహంబులకుఁ దీసికొనిపోవుచుందురు.

ధర్మశాలలంతగాలేని యీదేవప్రయాగయందు పండాలగృహములే యాత్రికులకు విడిదిస్థలములు. కావున నా పండాలు యాత్రికులకు బసదనమిచ్చి వారివలనఁ దమకురావలసిన ద్రవ్యలాభమును భద్రపఱచుకొనుచుందురు.

యాత్రికు లిక్కడినుండి రెండవపుణ్యక్షేత్రమగురుద్రప్రయాగకుఁ బోవుదురు. ఇచట మందాకినీనది అలకనందలో గలియుచున్నది. ఇది హరిద్వారమునకు 90 మైళ్ళదూరమున నున్నది. ఇక్కడనుండియె ప్రయాణము కష్టతరమగుచున్నది.

మార్గమధ్యమున గౌరీకుండమున్నది. ఇచట దారి యిరుకగుటచేత దిగువారలు పర్వతపుచరియలకు వీపుల నానించి నిలుచుండి, అలసిసొలసి యెక్కువారలకు దారి చేయుచుందురు. ఏమాత్రముకాలుజారినను కండ్లుతిరిగినను ఎన్నియోవందల యడుగులక్రిందఁ బ్రవహించు నదిలో పడి

మృతిజెందుట తప్పదు. ఈమార్గమునఁ బోవువారలలో వృద్ధులు చాలమందియుండుటచే నిట్టివిపత్తులు కలుగుచుండు ననుట నిస్సంశయము. గౌరీకుండమున రెండుజలాశయములు కలవు. ఒకదానియందు నీరు 74 డిగ్రీ లుష్ణోగ్రత కల్గియుండును. రెండవదానియందునీరుమిక్కిలి వేడిగ (124) నుండును. యోజించిచూడ నీపర్వతరాజము అగ్నిపర్వతోత్క్షేపము వలన నేర్పడినదనుట కిదియొక నిదర్శనమగుచున్నది.

గౌరీకుండమునుండి మూడుమైళ్లు చక్కగా నెక్కిన యెడల రంబారా (Rambara) విశ్రమస్థానము చేరుదుము. ఇచట చలి యధికముగ నుండును. వైశాఖమాసమున నయితము మంచుకరు ళ్ళిచటఁజూచినను గాన్పించుచుండును. మంచు కరుగుట కారంభించినపుడు హిమశకలములు కొండచరియలనుండి క్రిందికిదిగజారి లోయలో ప్రవహించు నదీశయ్యనంతను నింపుచుండును. ఇట్లు గుమికూడిన హిమశకలము లన్నియు నొకటియై యొక గట్టివంతెనగా నేర్పడును. ఈలా గేర్పడిన వంతెనక్రింద నొక సొరంగమేర్పరుచుకొని దానిగుండ మందాకినీనది ప్రవహించుచుండును. ఈప్రాంత్యమున నీమంచు|రాతివంతెనలే రాకపోకల కనుకూలములు. ఇచటనుండు సత్రములలోఁ గొన్ని వైశాఖమాసమున నయితము 'పిండి మంచులోఁ బూడియుండునని చదువరు లూహింపవచ్చును. రంబారానుండి రెండుమైళ్లు నిట్రముగా నెక్కితిమేని చెట్లు క్రమముగా నదృశ్యమగును. పర్వతపార్శ్వములం

దెటుఁజూచినను హిమము కరుగుచుండును. చిన్నచిన్న సెలయేరులు దారివెంబడి కలకలస్వనములతోఁ బ్రవహించుచుండును. వీనిప్రక్కన అడవి గులాబిపుష్పములు వికసించుచుండును. ఇట్లు ప్రయాణికుఁ డిట్టిదర్శనీయములఁ దిలకించుచుఁ బోవుచుండ నున్నట్టుండిదారి వంకరదిరుగును. దానిం గడిచినతోడనే ఆతని కట్టెదుట ఉన్నతనగాగ్రమంత కానంబడును. అవియే కేదారనాథశిఖరములు. ఇందున్నతమయినది 22,840 అడుగుల యెత్తుండును. ఈశిఖరములకుఁ గ్రిందిభాగమున నొక లోయలో కేదార్‌నాథగ్రామము కలదు. దాని ప్రక్కన కేదారేశ్వరాలయ మున్నది. ఈయాలయమునకు సమీపమున నొక గుండముకలదు. దానినుండి యెద్దియో వాయుకము బుద్బుదరూపమున పైకివెడలి "ఓం" అని పగులుచుండును.

భక్తాగ్రేసరు లద్దానింజూచి నిర్జీవంబున బుద్బుదంబు సయితము 'ఓంమహాదేవ' యని ప్రార్థించుచున్నదని తలంచి పారవశ్యతనొందుచుందురు.

కేదారనాథమునకుఁ బరిసరముననుండు ప్రదేశములు రమ్యముగ నుండుటచే చూపరుల ననేకుల నాకర్షించుచుండును. సమీపమున నొక జిరతకలదు. వీరశైవులలో గొందఱచటనుండి క్రిందికి దుమికి మహేశ్వరునకు దమ్మర్పించుకొనుచుందురట. దీని కనతిదూరంబున పేరియుండు సరోవర మొకటికలదు. ఇది యతి రమణీయముగనుండునుకాని యచటి

చలి దుర్భరము. తెల్లగఁజేరియుండు హిమపటలమునుండి పవనములు వీచుచుండుటచేత నచట చలి యెముకలకుగూడ దగులునట్లు బాధాకరముగ నుండును. ఐహికేచ్ఛల వదలి ఆముష్మికంబుల గోరినవారీ యనంతమగు హిమప్రదేశంబునకుంబోయి మరల రాకుందురట.

కేదారనాథమునుండి బదరీనాథశిఖరములు కానవచ్చుచుండి, యిక్కడికవి పండ్రెండుమైళ్ళ దూరముననే యుండినను దారిలేమిచే ప్రయాణ మసాధ్యము. కావున తైర్థికులచటనుండి వెనుకకుమరలిఉఖిమఠమునకే తెంతురు. ఇది కేదారేశ్వరుని యర్చకస్వామి చలికాలముననుండు స్థలము. ఇచటినుండి కొన్నిమైళ్ళు గడిచినతరువాత చోప్టా (Chopta) కనుమ వచ్చును. దీనిలో నేడుమైళ్ళెక్కుచుఁ బోవునపు డత్యద్భుతమైన అరణ్యప్రదేశ మగుపడును. అటనుండి తుంగనాశిఖరము జేరుదుము. పిమ్మట నాలుగంటలు మరల నెక్కితిమేని 12,454 అడుగుల యున్నతాంశగల స్థలము చేరుదుము. అచట కనబడు సీనరి (Scenery) వర్ణింప తరముకాదు. అన్ని వైపులను హిమముచేఁ గప్పబడియుండు పర్వతశిఖరములు కనుపండువు చేయుచుండును. త్రిశూలపర్వతపంక్తి యిరువదివేల యడుగుల యెత్తుగలిగి దాదాపు పదిమైళ్ళు వ్యాపించియుండునట్లు గోచరమగును. అచ్చటినుండి యాత్రికుఁడు జోశి (Josi) మఠమునకు వచ్చును. ఇది శంకరపీఠము. ఆదిశంకరులు తన శిష్యవర్గమునకై స్థాపించిన మఠములలో నిది యొకటి.

జోశీ మఠమునుండి రెండు మైళ్ళు నడిచినతర్వాత యాత్రికుఁడు విష్ణుప్రయాగఁ జేరును. ఇచట ధౌలీ (Dowli) నది అలకనందానదితో సంగమమగుచున్నది. ఈ సంగమ స్థానమునకుఁ బైభాగమున అలకనందానదికి విష్ణుగంగయని పేరు. తరువాత పదిమైళ్ళు విష్ణుగంగవెంబడి ప్రయాణము చేయవలసియుండును. మార్గ మతిరమణీయముగ నుండును. ఏవైపుఁజూచినను దేవదారువృక్షములు ఆకాశము నంటిన ట్లుండును. మార్గ మతిరమణీయముగ నుండును. ఏవైపున జూచినను సిందూరవృక్షములు (Oak) విశాలపర్వతములతో రమ్యముగ గానవచ్చుచు. ఇవి చాలమొండివి. వీనిచాటున జాల సున్నితమైన దేవదారువృక్షము లుద్భవించి యాకాశము నంటినట్లెదిగియుండును. చూపరుల కివి మిగుల సుందరమగు దర్శనీయములై యున్నవి. భావిజ్ఞాననేత్రముగలవారల యపూర్వసంయోగ మత్యద్భుతముగ గాన్పింపక మానదు. సిందూరవృక్షము ఇంగ్లాండునందలి ముఖ్యవృక్షము. దేవదారువు భరతఖండపుచెట్టు. సిందూరవృక్షముల చాటున దేవదారువృక్షము లెట్లు యమున, గంగ, బ్రహ్మపుత్రానదుల పవిత్రశిరోభాగముల గలిసిమెలిసి వృద్ధినొందుట జూడ సున్నిత హృదయులగు భారతీయులు ప్రబలులగు ఆంగ్లేయుల రక్షణమున వృద్ధినొందుదురని భావిసూచన గావించిన ట్లగుపడుచుండును.

ఇట్లు పోవుచు దారియందొకరాత్రి గడిపి హనుమాన్ విశ్రమస్థానముం జేరుటోపల అడవిగులాబిచెట్లనడుమ నడుచుచు వాని పరిమళ మాఘ్రాణించి యానందించుచు దూరమునఁ జిత్రవిచిత్రముగఁ గన్పడు తుహినాద్రిశిఖరములం జూచుచు యాత్రికుఁడు ప్రయాణమయి పోవుచుండును. ఇంతలో గమ్యస్థానమగు బదరినాథాలయము కాన్పించును. తోడనే యాత్రికులందర టచట సాష్టాంగదండప్రణామం బాచరించి ముందునకుంబోయి ఋషిగంగానదిందాటి బదరినాథాలయముం జేరును. ఈ యాలయమునకుఁ గ్రిందిభాగమున తప్తకుండ మొకటి కాన్పించును. యాత్రికు లీగుండములోని వెచ్చనినీట మజ్జనమాడి తమవెంట నేతెంచిన పండాలకుఁ బారితోషికముల నొసంగి బదరినారాయణుని దివ్య మంగళవిగ్రహ సందర్శనము చేసికొందురు. ఈ దేవాలయ ముందు లోయ కిరుపార్శ్వములందును రెండు పర్వత శృంగము లున్నవి. అచట నరనారాయణులను ఋషులు తపంబు సేయుచుండిరట. కావున నాశృంగముల నరనారాయణ శిఖరములని పిలుతురు. ఆలోయ పైభాగమునకుఁ బోయినవారు శతోపంత్ హిమానీనదమును జూడఁగల్గుదురు. ఇట్లు రెండువందల మైళ్లు నడిచి ప్రయాణికు లలసియుందురు. పాదములు పుర పుర పొక్కియుండుటచేతను, అచటి చలి యతి మిక్కుటముగ నుండుటచేతనూ యాత్రికు లట జాలకాలముండ నిచ్చగింపరు. రెండుమూడు దినము లటనుండి ప్రయాణాయాసము కొంతదీర్చికొని వెనుకకు మరలి వచ్చినదారినే కొంతదవ్వేఁగి

కర్ణప్రయాగ దాటినతరువాత నేఱుగా దక్షిణమునకుఁ బోవుచు రామనగరున కేతెంచి యట రైలునెక్కి వారివారి గ్రామములకుఁ బోవుదురు.

బదరినాథయాత్ర పూర్తియగుటకు సాధారణముగా రెండుమాసములు పట్టును. నాలుగువందలమైళ్ళు కాలినడక తప్పదు. అయినను భక్తులీ వ్యయప్రయాసములకు జంకక భగవదారాధన కొఱకై పరిశ్రమించుచు అత్యద్భుతమగు దర్శనీయములం జూచి జన్మసాఫల్యంబు నొందుచుందురు.

7. మైదానప్రదేశ ప్రథమభాగము.


గంగానది హరిద్వారమునువదలి దక్షిణాభిముఖముగాఁ బ్రవహించుచుఁ గొంచెముకొంచె మాగ్నేయమునకుఁ దిరుగుచున్నది. ఈనడుమ చిన్నచిన్న నదు లెన్నియో యిందుఁ గలియుచున్నవి. వీనిలో రామగంగ ముఖ్యమయినది. గంగ దాదాపుగా నాలుగువందలమైళ్ళు ప్రవహించునప్పటికి గంగతో సమానమనందగిన యమునానది అలహాబాదునొద్ద దానితో సంగమమగుచున్నది. గంగానదితో నిది కలియుటకుఁ బూర్వము ఆరావళి వింధ్యపర్వత మధ్య ప్రదేశములఁ గురిసిననీటిని వెల్లువలుగాఁ గొనుచు సంబళనది (chambal) యమునానదిలోనికిఁ బ్రవహించి యమునయందునీటి నధికముచేయుచున్నది.

ఈయమునానది గంగానదివలెనే హిమాలయపర్వతమున యమునోత్తరయను హిమానీనదమున నుత్పత్తియగు

చున్నది. దాదాపుగా పదునొకండువేల యడుగుల యౌన్నత్యముకలిగి నిరంతరము హిమముచేఁ గప్పబడి చూపరుల కద్భుతముగ గానంబడుచు పర్వతశృంగపరంపరల పాదతలంబున, గంగానది పుట్టుచోటునకు సమీపంబున నీహిమానీనదమున్నది. యమునానది యిచ్చట చిన్నప్రవాహముగా బయలుదేరి రానురాను పెద్దదగుచు మెట్టుమెట్టుగా గ్రిందికి దుముకుచు పర్వతశాఖలఁ జీల్చుకొని సమప్రదేశమునకుఁ బ్రవహించుచున్నది. ఇట్లు రమారమి 800 మైళ్ళు గంగానదికి సమాంతరముగాఁ బ్రవహించుచుఁ గడపట అలహాబాదునొద్ద గంగలోఁ గలియుచున్నది. వీని సంగమస్థలమున ఇరుకయి త్రిభుజాకారమున నుండు నేలయే ప్రయాగయనంబడు పవిత్రస్థానము.

ఈయమునానదినుండి కాలువలమూలమున నీటిని ఇరుప్రక్కలనుండు భూములకుఁ బాఱఁగట్టి వేలకొలది యెకరములభూమిని సాగుచేయుచున్నారు. కావున యమునా గంగలకు నడుమనుండు ప్రదేశము (Doab) మిక్కిలి ఫలవంతమయి అపారముగా గోధుమపంట నిచ్చుచు జనుల ననేకుల బోషించుచున్నది.

ఇందుండు పట్టణములలో ఢిల్లీనగరము ముఖ్యమయినది. ఇది చాలకాలమునుండియు భరతఖండమునకు ముఖ్యపట్టణముగా నుండినది.



డిల్లీనగరము

ఎన్నియో విషాదముల ననుభవించినది. ఎందఱిచేతనో అలంకరింపఁబడినది. మహాభారతకాలమున నిదియే ఇంద్రప్రస్థనగరము తరువాత పృథ్వీరాజు కాలమున నిదియే ముఖ్యపట్టణము. మహమ్మదీయచక్రవర్తియగు ఫిరోజిషా టొగ్లాకు యొక్క రాజధాని యిప్పటి డిల్లీలో నొకభాగముగా నుండెను. తరువాత మొగలుచక్రవర్తుల యధీనమయినపుడు వారెంతయో దీనివన్నెకు దేగల్గిరి. ఇందనేక హర్మ్యముల గట్టించిరి. ఇందు దివానిఖాస్ (Divanikhas) అనుభవనము ప్రసిద్ధిచెందినది. మొగలుచక్రవర్తులిందు రాయబారులకును దమ ప్రజలకును దర్శన మొసంగుచుండిరి.


ఇది చాల గొప్పదై నయనానందకరంబై యమునానదికి సమీపమున నలరారు ఆస్థానమండపము. ఈ నగరమునకు రెండుమైళ్ళ దూరమున నిరుపమానసౌందర్యమునకు బేరొందిన హుమాయూన్ గోరియున్నది. కోట కెదురుగా జుమామసీదున్నది. పదిమైళ్ళదూరములో కుతుబ్ మినార్ [Kutab Minar] అను జయస్థంభము కలదు. ఇది 238 యడుగుల యెత్తుగలిగి క్రిందిభాగమున 47 అడుగుల వ్యాసము [Diameter] కలిగి పోనుపోను సన్ననగుచు పైభాగమున దొమ్మిది యడుగుల వ్యాసము కలిగి చూపరుల కాశ్చర్యము గొలుపుచున్నది. ఇట్టి యున్నత జయస్థంభము ప్రపంచమున నెచ్చటను గానరాదు.

ఈ ఢిల్లీనగరము బానిసరాజుల ముఖ్యపట్టణముగా నుండుకాలమున సుల్తాన్ ఆల్టమష్ గతించినపిదప రజియాయను పుత్రిక యాతని కుండెను. ఆమె విద్యావతి. అనన్యసామాన్య సౌజన్యరాశియనియు, నిరుపమాన సౌందర్యవతియనియు పేరొందియుండుటచే ప్రజ లీమె నేకగ్రీవముగ నీమెకు బట్టము కట్టిరి. తన చాకచక్యముచేతను శౌర్యసాహసాది సద్గుణముల చేతను ఈమె నాల్గువత్సరంబులు ప్రజాపాలనంబు ధర్మమార్గంబున నడిపెనుగాని అటుతరువాత నామె తన యాశ్విక నాయకుఁడగు నొక అబ్సినియాదేశపు యువకునెడఁ బక్షపాతము జూపుచుండెనను నెపంబున వాహినీపతులలో గొందఱు కినుకంబూని ఆమెకు బదచ్యుతిఁ గల్పించి హంతకుల పాల్సేసిరి.

ఈ నగరము 1857 వ సంవత్సరమువఱకు మన భరత ఖండమునకు రాజధానిగ నుండెను గాని పిమ్మట నది యాంగ్లప్రభువుల వశ్యమగుటచేత నౌకాచలముగల యాంగ్లేయు లానగరమును విడిచి సాగరసమీపంబుననుండి సముద్రయానమున కనుకూలముగ నుండు కలకత్తాను రాజధానిగఁ జేసికొనిరి. ఢిల్లీనగర మిట్లు కొంతకాలముతన ప్రాముఖ్యమును గోల్పోయినను రాజ్యస్థిరత సమకూరినతరువాత ఆంగ్లేయులు మరల 1911 వ సంవత్సరమునఁ దమ రాజధానిని ఢిల్లీనగరమునకు మార్చిరి. హైందవసామ్రాజ్యమునకు రాజధాని యగుటకుఁ దగియుండు నట్టీ నగరరాజమునిపుడు సౌధరాజ

ములచేతను ప్రమదావనంబులచేతను అలంకరింపఁ బ్రయత్నములు జరుగుచున్నవి.

యమునానదికి సమీపంబున జగత్ప్రసిద్ధమైన నగరము మఱియొకటి కలదు. ఇదియే అగరాపురి. [Agra] బేబరు చక్రవర్తి కాలమున నీ ప్రదేశము బిట్టబీడుగా నుండినది. ఈ ప్రదేశమున నొక ప్రమదావనము నిర్మింపఁ నాతఁడు నిశ్చయించి ఇంతకంటె ననుకూలమగు ప్రదేశ మెందునుం గానక యీ స్థలమున నాతఁ డద్దాని నిర్మింప నిశ్చయించి గులాబి తోటల వేయించి మల్లి జాజి సంపెంగ మొదలగు పుష్పలతలచే నా ప్రదేశము నలంకరింపఁ జేసెను. పిదప నచ్చటచ్చటఁ గొలకుల ద్రవ్వించి జలక్రీడల కనుకూలము గావించెను. కాని యవన్నియు అక్బరుకాలమునకే శిథిలమయి యుండుటచేత నాతఁ డీనగరమును మరల నిర్మించెను. పిదప షహాజహాన్ చక్రవర్తియయినపు డాతఁడు ఆగ్రాను తన రాజధానిగఁ జేసికొని అందనేక హర్మ్యములఁ గట్టించెను. వానిలో ముఖ్యమైనవి తాజ్‌మహల్, జుమామసీదు, మోతీమసీదు, దివాన్-యి-యామ్, దివాన్-యి-ఖాస్ భవనములు. వీనిలో తాజ్‌మహల్ జగత్ప్రసిద్ధి నొంది నేటికిని ప్రపంచపుటాశ్చర్యములలో నొకటి యయిలక్షులకొలది చూపరుల నాకర్షించుచున్నది.



తాజ్ మహాల్

1642 వ సంవత్సరమున నిరువదియైదేడులు పూర్తిగా నిండని రాకొమరుండగు షాజహాను పందొమ్మిది సంవత్సరముల యువిదయగు అర్జుమాన్దుబానుబేగమును భార్యగాఁ గైకొనెను. ఈమె రెండవభార్యయైనను వారిరువురకన్యోన్యానురాగము మెండుగనుండెను. కావున వారొండొరులఁ బాయఁజాలకుండిరి. సహజభీరువులగు స్త్రీలొల్లని రణాంగణంబున కామె తనపతితోఁ బోవ నిశ్చయించెను. ఆమె యందలి మక్కువచే షాజహానుఁ డద్దాని కంగీకరించుటచేత నీదంపతులొండొరుల నీడవలె నెడబాయకుండిరి.

ఇట్లనవరత మొకరినొకరెడబాయకుండుటయే కాక రాజకార్యములందుసయితమామె తనపతికిఁ దోడుపడుచు సహజమృదూక్తులచే నాతని మనంబు కరఁగించి రాజశాసనంబుల కాఠిన్యంబు తగ్గించి వాని దయారసంబుచే నింపుచుండెను. ఇట్లగుటచే ప్రజలామెను దల్లిగ భావించుచుండిరి. సోయగంబున నిరుపమానయని యెంత కీర్తిఁగాంచెనో దయాంబురాసియనియు సాధ్వీమతల్లియనియు, నామెయంత పేరు వడసియుండెను.

ఇట్టి మంతాజ్‌మహాలు పదుమువ్వుర పుత్త్రులం గని పదునాల్గవ గర్భంబుదాల్చి యుండెను. అపుడు షాజహాను చక్రవర్తియయి నాల్గుసంవత్సరము లయియుండెను. దేశమందు గడిబిడ లచ్చటచ్చట నగుచుండుటచేత బర్హాన్‌పూరునందలి ఖాంజహాన్‌లోడీపై జక్రవర్తి దాడివెడలియుండ

ముంతాజ్‌మహల్ సయుత మాతనివెంట బర్హాన్‌పూరునకుం బోయియుండెను. అచట నామె ప్రసవించెనుకాని బాలెంత జాడ్యముచే నామె మరణము నొందెను. అట్టి తరుణంబున షాజహానుఁడుపడిన పరితాపంబునకు మితియుండగలదా? ఒకవారముదినము లాతఁడు వజీరుల నెవ్వరిం జూడక రాజకార్యములఁ దిలకింపక ఆహారాదుల వర్జించి దుఃఖసాగర నిమగ్నుండై యుండి రాజ్యత్యాగంబుసేయ యోజించుచుండెను. కడపట మనసు దిటపఱచుకొని శవంబున కంత్యక్రియలుసేయ నిశ్చయించి తాజ్‌తోఁటయందు దానినుంచి తాజ్‌మహల్ పునాదిపనులు పూర్తియయినతరువాత నా శవంబు నందుస్థాపితముచేసి పిదప దానిపై నిప్పటియద్వితీయమైన కట్టడమును నిర్మింప నారంభించెను.

దీనికై షాజహానుఁడు ప్రశిద్ధిఁగాంచిన శిల్పశిఖామణుల రావించి తన యభీష్టంబు వారికిఁ దెలిపెను. వారొక ప్లానును సిద్ధపఱచి దానిం జక్రవర్తి యంగీకారమునకై పంప నాతఁడద్దానికిఁ దనసమ్మతి నొసంగి వలయుకర్మకరుల నానాదేశములనుండి దెప్పింప మొదలిడెను. బాగ్దాదు, ఢిల్లీ ముల్తానుల నుండి తాపీపని వారేతెంచిరి. గోపురనిర్మాణకులు టర్కీ సమర్కాండులనుండి వచ్చిరి. నగిషీపనులకుఁ బేరుగాంచిన కనూజిబాగ్దాదులనుండి తాపడము (Inlay) వారు సమావేశమయిరి. షైరాజ్‌నుండి చిత్రకారులు తారసిల్లిరి.

శిల్పకళావిశారదులగు కర్మకరు లిట్లు నానాదేశముల

నుండి వచ్చుచుండ సామగ్రులుకూడ పలుభాగములనుండి సంచయింపఁబడుచుండెను. జయపురము చలువరాలను బంపెను. సిక్రీయెఱ్ఱనిసైకత శిలల నెగుమతి చేసెను. పంజాబునుండిజాస్పరు (Jasper) వచ్చెను. చైనా స్ఫటికశిలల నర్పించెను. అరేబియానుండి పవడములవ్వారిగ నేతెంచెను. బుందేలఖండులోని గనులు వజ్రముల నిందులకు సమకూర్చెను. పారశీకదేశమునుండి పచ్చలేతెంచెను.

ఇట్టు లపరిమితముగ సంచయమగుచుండు పదార్థముల సేకరించి ఇరువదివేవురు కర్మకరుల నీమహాకార్యమునకు నియోగింప నిదిపూర్తియగుటకు పదునేడు సంవత్సరంబులు పట్టెను. దీనికి దాదాపుగా నాలుగు కోట్లరూపాయల వ్యయమయ్యెను. అనన్యసామాన్యసుందరియగు ముంతాజ్‌మహాలే ఈయమునానదిగట్టున నీరూపంబున మూర్తీభవించి సంచరించుచున్నదో యనునట్లు ఈమందిరము చూపరుల హృదయంబులకుఁ బొడగట్టుచుండుననుటనిస్సంశయము.

9. మైదానపుదశ (ద్వితీయభాగము)

మైదానపుదశయందు గంగానది అలహాబాదువద్ద రెండవభాగమునకు వచ్చుచున్నది. గంగాయమునలు సంగమమగు స్థలమున ఇరుకుగను త్రిభుజాకారముగను ఉండునేలయే ప్రయాగ యనఁబడు పుణ్యక్షేత్రము. పూర్వకాలమున సరస్వతి యనునది సింధునదిలోనికిఁ బ్రవహించుచుండినది. ఆనదియు

దదృశ్యమయినది. కావుననది అంతర్గామియై గంగాయమునా సంగమప్రదేశమున గంగలోఁ గలియుచున్నదని జనులు నమ్మకము గలవారయి అయ్యది త్రివేణీసంగమస్థానమగుటచే మహాపుణ్యక్షేత్రమని విశ్వసించుచున్నారు. కావున లక్షల కొలది తైర్థికులీత్రివేణీసంగమస్థలమున స్నానముచేయుటకుఁ బోవుచుందురు. వేణీదానముల నెందరో స్త్రీలిచట నిచ్చుచుందురు.

ఈత్రివేణీ సంగమస్థానమున గంగా యమునానదులు నీరుకలిసిపోవుటలేదు. ఒకప్రక్కన యమున తెచ్చు తెలినీరు స్వచ్ఛముగాఁ బ్రవహించుచుండును. దానినంటియే గంగానది జలము వండుమంటిచేఁ బచ్చగఁ గల్పించుచు బారుచుండును గాని యాజలములు కలియుటలేదు. ఈప్రాంతమున నేలదిగుడు మైలున కాఅంగుళములే యగుటచేత బ్రవాహవేగము తక్కువయగును. కాననే గంగానదికిట మందాకినియను నామమెంతయు నొప్పియున్నది.

ఇమ్మందాకిని యిటఁ బ్రవహించునపుడు మనపూర్వులీనదికి మానుషత్వము నొసంగి మందగమనయగు నొక సుందరిగా వర్ణించియున్నారు.

ఈమె మానవస్వరూపము ధరించి నిర్జితేంద్రియుండగు భీష్మునిం గనెనని మహాభారతము చెప్పుచున్నది. ఆకథ నిట వివరించెదము.

గాంగేయుని జననము.

గంగానదితీరమున కురురాజ్య మొండు కలదు. ప్రతీపుండను రాజు దానిని బాలించుచు, విద్యాబుద్ధులమిన్నయైన తన కొమారుఁడగు శంతనునకు రాజ్యభారం బప్పగించి తాను తపంబునకై వెడలెను. శంతనుఁ డొకనాడు వేఁటకుఁ జని, యొంటరిగా నరణ్యమంతటను దిరిగి యలసి దేహమంతయుఁ జెమ్మటలు గాఱుచుండ, గాంగసైకతతీరములందుఁ జల్లని గాలిలో విశ్రమింపఁ దలంచి, యచటికి వచ్చెను. అచట గంగ మనుజస్త్రీరూపము దాల్చి తిరుగుచుండెను. దివ్యమంగళవిగ్రహయగు నాకన్యకం గని మునికన్యయో దేవకన్యయో యని యచ్చెరువందుచు, ఆమెవైపున ఱెప్పవాల్పక శంతనుఁడు చూచుచుండెను,

చ. కని "వనకన్యయో! దనుజకన్యకయో! భుజగేంద్రకన్యయో!
యనిమిషకన్యయో! యిదివియచ్చరకన్యకయో! యపూర్వమీ
వనమున కిట్లు లేకతమ వచ్చునె మానవకన్య!" యంచు న
య్యనఘుఁడు దానిఁ జిత్తమున నాదటపోవక చూచెఁ బ్రీతితోఁ

ఆయింతియు నాతనిమనం బిదియని గ్రహించి, నా తనిరూపునకు మెచ్చుకొనుచు నిలువఁబడియుండెను. శంతనుఁ డింతలో నామెను సమీపించి 'నీవెవ్వతెవు? ఒంటరిగా నిటఁ దిరుగుటకుఁ గారణమేమి?' అని యడుగ, తనయం దాతనికిఁ

ప్రేమగల్గినదని యెఱింగి 'రాజా! నే నొకకన్యను. నే వేఁడు వరం బిచ్చెదేని నీకు భార్యనయ్యెద'నని యాయింతి ప్రత్యుత్తర మిచ్చెను. శంతనుం డానంద మంది వరం బెద్ది యని యడిగెను. నేనెద్ది సేసినను దానికి నొడంబడి వారింపకుండుటయు, నన్ను నప్రియంబులు పలుకకుండుటయు నాకోరిన వరంబులు వీని నిచ్చెదవేని నీకు భార్యనయ్యెద'నని యామె చెప్ప 'ఇట్టి గుణవతి దుష్కార్యమెన్నటికైనఁ జేయునాయ'ని తలంచి యట్లె చేసెదనని యామెకు మాటయిచ్చి గాంధర్వ విధానంబునం బెండ్లియాడి యామెను తనవెంట నగరమునకు దీసికొనిపోయి సుఖంబున నుండెను.

కొంతకాలమున కామె కొక కుమారుఁడు పుట్టెను. పుట్టినతోడనే యాశిశువును నామె గంగానదిలోఁ బాఱవైచెను. రాజు మాటాడకుండెను. రెండవకుమారుఁడు పుట్టెను. వానినిగూడ నట్టులే గంగలోఁ ద్రోసెను. మూఁడవ కుమారునిగతియు నట్లెయయ్యెను. ఇట్లేడుగురుకుమారులు గంగలోఁ బడిపోయిరి. కన్నకుమారుల నిండఱ గంగలోఁ బడద్రోసిన యాతల్లి రాక్షసిగాని మనుష్యస్త్రీ గాదని జను లనుకొనుచుండుటయేగాక, పుత్రఘాతిని యగు నారక్కసి దేశమున నుండఁగూడదను తలంపు ప్రజల కెక్కువ యగుచుండెను. 'రాజు స్త్రీలోలుఁడయి నిర్దయుఁడై, కటికిదానికంటెను నీచురాలగు భార్య పైసొగసులకును, వలపుమాటలకును, దాసానుదాసుఁడై కన్నకుమారులను భార్య చంపుచుండఁ

పౌరుషహీనుఁ డయి యూరకున్నవాఁడు. ఇట్టి రాజుండిన నేమి లేకుండిన నేమి! తన యింటికార్యమునే చక్కఁబెట్టుకొనలేక దారుణకర్మంబులం జూచియుఁ జూడనట్లూరకుండువాఁడు మనల మాత్రమెట్లు న్యాయ్యముగఁ బాలింపఁగలఁడు! ఇట్టి స్త్రీలోలుఁడు మనకు రాజుగా నుండఁదగడు,' అని జనులు గుంపులుగుంపులుగాఁ జేరి యనుచుండిరి. ప్రజానురంజకుఁడుగా నుండిన శంతనుఁడు లోకకంటకుఁడుగాఁ బ్రజలకుఁ గన్పడుచుండెను. కాని ప్రేమయు గౌరవము లేకపోయినను భయమొకటి వారల బాధించుచుండుటచేత జనులింకను రాజు నెదిరింప వెఱచుచుండిరి.

ఇట్లుండ రాజుగారి భార్య మరల గర్భవతియాయెను. జనులందఱా విషయము విని యిపుడేమగునో చూతమని వేచియుండిరి. పుత్త్రుఁడొకఁడు గలిగెను. రాజుభార్య యెప్పటివలె వాని నీటం ద్రోయ సమకట్ట శంతనుఁడు పుత్రమోహంబున నాదారుణకృత్యంబున కోర్వఁజాలక వానిని జంపకుమని యడ్డుపెట్టెను.

కం. "పడయంగరాని కొడుకులఁ
గడుబలువురఁ బడసి పుత్రఘాతిని వైతీ
కొడుకు నుదయార్కతేజుని
విడువఁగ నేనోప ననుచు వేఁడుకతోడన్."

ఆమాటలువిని గంగ పూర్వప్రతిజ్ఞ జ్ఞాపకముచేసి 'ఇఁక నేనిచ్చట నుండను. నీకును నాకును ఋణముతీఱినది. నేను

త్రిభువనపావని యనంబరఁగిన గంగను సుమీ! దేవహితార్థము మనుష్య స్త్రీరూపంబు దాల్చితిని. నాగర్భంబునఁ బుట్టినవారు వసువులు. కడపటి యీ శిశువు సకలధర్మమూర్తియయి లోకహితార్థము భూలోకమునఁ జాలకాలముండు' నని చెప్పి స్వస్వరూపంబు శంతనునకుఁ జూపి, బాలుండు పెరుఁగునంతవఱకు తనయొద్ద నుండునట్లు శంతనునొడంబఱచి గంగ కొడుకుం దోడుకొని పోయెను. శంతనుఁడు మిక్కిలి విచారపడి యెట్టకేలకు మనసు దిట్టపఱచుకొని ధర్మమార్గమున రాజ్యము సేయుచుండెను. ప్రజ లాతని ధర్మాత్ముఁ డని పొగడుచుండిరి. రాజు లాతనికిఁ గప్పములర్పించి చేదోడు వాదోడుగ నుండిరి. సంవత్సరములు గడచుచుండెను.

మ. తన కాజ్ఞావశవర్తులై మహి సమస్తక్షత్రవంశేశు లె
ల్లను భక్తిం బనిసేయుచుండఁగ, విశాలంబైన సత్కీర్తి ది
గ్వనితామౌక్తిక దామలీల వెలుఁగన్, వారాశిపర్యంతభూ
జనరక్షాపరుఁ డయ్యె శంతనుఁడు రాజద్రాజధర్మస్థితిన్.

ఇట్లుండ నొకనాఁడు శంతనుఁడు వేటకై వెళ్ళి గంగానదిగట్టున సంచరించుచుండ నదియందు నీరు మిక్కిలి తక్కువగ నుండుటఁ జూచి విస్మయమంది 'నిరంతరవాహిని యగు నీమందాకిని ఏలొకో యెండియున్నది! ఈవిచిత్రమునకుగారణమేమైయుండనోపు'నని తనలో దాననుకొనుచు, కారణమరయుటకై నది వెంబడి పైభాగమునకుఁ బోయెను. దూర

మున ధనుర్విద్య నభ్యసించుచు బాణములచేత గంగకు నానకట్ట కట్టి నీటిని నిర్బంధించియుండు బాలుని జూచి ఆసుందరసుకుమారుఁ డెవఁడో యని తత్తఱపడుచు, మనంబునఁ బుట్టిన ప్రేమాతిశయముచేత నాబాలుని సమీపించి, యాతని యస్త్రవిద్యాకౌశలంబుఁ జూచి విస్మయం బొంది నిలిచి యుండెను. ఇంతలో గంగ ప్రత్యక్షమయి యాబాలుని చేయిఁ బట్టుకొని శంతనుని సమీపించి "మహారాజా! వీఁడు నీ పుత్రుఁడు. వసిష్ఠునియొద్ద వేదవేదాంగములఁ జదివెను. సకలధర్మశాస్త్రములు బృహస్పతివలె నేర్చుకొనెను. విలువిద్యయందు పరశురామునివంటివాఁ డయ్యెను. ఆత్మజ్ఞానంబున సనత్కుమారులతో సమానుఁడు. ఇట్టి నీసుతుని గొనిపొమ్ము" అనిచెప్పియంతర్ధానమయ్యెను. పెన్నిధిగన్నపేద చందంబున శంతనుఁడు సంతసించి యాబాలుని తనవెంటబురంబునకుఁ గొనిపోయి, సకలరాజ్యప్రధాన సమక్షంబునఁగాంగేయునకు యౌవనరాజ్యాభిషేకంబు చేసి, కొడుకుతోడి వినోదంబుల ననుభవించుచుఁ గొన్నిసంవత్సరములు గడపెను.

ఇట్లు గంగానది తూర్పునకుం బ్రవహించుచుండ ఉత్తరప్రాంత్యభూముల నుద్భవించి నైమిశారణ్యమని పూర్వము పేరుగాంచిన ప్రదేశమును పావనముచేయు గోమతి (Gumti) నది గంగలోఁ గలియుచున్నది.

మందాకిని కొంతదూర మిట్లు ప్రవహించుచుండ వరుణ, అసియను రెండు చిన్ననదులు దీనిలోఁ సంగమమగు

చున్నవి. ఈరెంటికిని నడుమనుండు పురమునకే వారణాశి లేక కాశీయనియు పేర్లు. మోక్షదాయకములగు సప్తపురములలో నిది మిక్కిలి ప్రశిద్ధిచెందినది.

ఈపురము గంగ కుత్తరపుగట్టున నున్నది. ఆర్యుల కాలము నుండియు నీపట్టణ మీప్రదేశమున నుండినట్లు కనఁబడుచున్నది. బుద్ధుఁడు యీక్షేత్రమును కేంద్రస్థానముగఁ జేసికొని సమీపముననుండు శారనాథునందు నివాసముచేయుచుఁ దనమతమునన్ని దిశల వ్యాపింపఁ జేయుచుండెను. దీనిచేత రమారమి యెనిమిదివందల యేండ్లు కాశీకానగరము బౌద్ధమతమున కాదిపీఠమై యుండెనని వ్యక్తమగుచున్నది. పిదప హిందూమత మిచట ప్రబలినది. 1194 వ సంవత్సరమున నిది మహమ్మదుఘోరీకి లోఁబడెను. అప్పటినుండియు దాదాపుగా నాఱువందల వత్సరంబు లిది మహమ్మదీయుల యధీనమున నుండినది. కావున వారు హిందువుల దేవాలయములను బడఁగొట్టించి మసీదులఁ గట్టించుటచేత దక్షిణదేశమునం దుండునట్లు ఇచట నొకటియైన పెద్దదేవాలయము కానఁబడుట లేదు. ఉన్నవికొన్నియుఁ జాలచిన్నవై శిల్పకళానైపుణ్యముం జూపక ముదుగుగా నున్నవి. వీనిలో ముఖ్యమైనది విశ్వేశ్వరాలయము. దీనిగోపురము బంగారుమలాము పూయబడిన రాగిరేకుచేఁ గప్పబడియుండుటచేత దీనికి బంగారు దేవాలయమను నామంబుకలదు. కాశీకాపురమందుండు దేవాలయములలో నెల్ల నిదియే ప్రాముఖ్యము నొందినది.

అయినను యీదేవాలయము పెద్దదికాదు. ఇది 51 అడుగుల యెత్తుమాత్రమే యున్నది. శిల్పనాకౌశల్యమయినను ఇందుఁ గనఁబడుటలేదు. కాని భక్తాను లిచటి ఈశ్వరసందర్శనమునకై యనుదినము వేలకొలది మూఁగుచుందురు. ఈదేవాలయమున నర్చకు లున్నారనుటయేగాని మన తిరుపతి మొదలగు దేవాలయములందువలె వారి ప్రభావమిచట నంతగాఁ గాన్పించుటలేదు. భక్తులు కలశములతోఁ దీర్థముం దెచ్చి వెలుపల నెల్లప్పుడు విక్రయమునకు సిద్ధముగ నుండు బిల్వాదులంగొని యేయభ్యంతరములేక యే దేవాలయము లోని గర్భగుడికిం బోయి 'హరహరమహాదేవ' యను రవంబు మిన్నుముట్టునట్లు పఠించుచుఁ గలశోదకంబును లింగముపైఁ బోసి భక్తిపూర్వకముగ బిల్వాదుల నాలింగముపై నునిచి ప్రదక్షిణనమస్కారంబు లొనర్చి వెళ్ళుచుందురు. కావున నీదేవాలయంబున మన తిరుమల దేవస్థానంబునందుండు విధముగా భక్తులు గుమికూడి దైవసందర్శనమునకై పెనగులాడుట లేదు. జంకచక్రప్రయోగసుఖము నొందియు దైవసందర్శన భాగ్య మబ్బదయ్యెఁగా యని నిరుత్సాహులై మరలు వారుండరు. కావున నిరుపేదలు సయితము ఈశ్వరార్చన అతిసులభంబుగ లభ్యంబగుటచే

శ్లో॥ గంగాతరంగకమనీయ జటాకలాపం
గౌరీనిరంతర విభూషితవామగం


నారాయణప్రియమనంగ మదాపహారం
వారణాశీపురపతిం భజ విశ్వనాథం.

అనుచు విశ్వేశ్వరుని ధ్యానించుచు సంతృప్తిహృదయులై మరలుచుందురు.

ఈనగరమునందలి యితర దేవాలయములలో అన్నపూర్ణాలయము మఱియొకటి. ఇచట ప్రతిదినము బీదలకు బిచ్చ మొసంగబడుచుండును. కావున బీదసాద లెందరో యిచట ననుదినము మూగుచుందురు. ఈయాలయము పునహారాజుచేఁ గడచిన శతాబ్దమున నిర్మింపఁబడినది.

కాలభైరవాలయము పేరొందినవానిలో మఱియొకటి ఈదేవుని నామస్మరణ ప్రభావంబున వృశ్చికాదిక్షుద్రజంతువులు మనుజులనంటవని మవహారు విశ్వసించుచు చీకటిలోఁ దిరుగునపుడు కాలభైరవకాలభైరవయని యాతని నామస్మరణము చేయుచుందురు.

కాశికానగరమునందలి చిత్రములలో ఘట్టములు చూడదగినవి. గంగానదివెంబడి దాదాపుగా నైదుమైళ్ళ దూరము నీటిలోనికి దిగుట కనుకూలముగ రాతిచే మెట్లు కట్టబడి యున్నవి. వీనిలో అసిసంగమఘట్టము, దశాశ్వమేధ ఘట్టము, మణికర్ణికాఘట్టము, పంచగంగాఘట్టము, కేదార ఘట్టము, సింధియాఘట్టము ముఖ్యమయినవి. కడపటిదగు సింధియాఘట్టము నీటిరాపిడిచే గ్రమముగా శిథిలమగుచున్నది.



దశాశ్వమేధ ఘట్టము.

ఈఘట్టము లన్నిటిలో మణికర్ణికాఘట్టము మిగుల ప్రసిద్ధిఁజెందినది. ఇచట నొక పుష్కరిణి కలదు. దీని శ్రీమహావిష్ణువు తనచక్రముచే ద్రవ్వెననియు, ఇందలి జల మమ్మహామహుని దేహమునుండి వెలువడిన ఘర్మసలిల మనియు నందురు. మహాశివు డీపుష్కరిణింజూచి యానందించి విష్ణువుతో మాటలాడుచుఁ దలయూపినపుడు ఆతని చెవియందుండిన కుండలము నీటఁబడెననియు దీనిచేత మణికర్ణికాకుండమని దీనికి పేరువచ్చెననియు నొక కథకలదు కావున నీఘట్టము నిందుండు పుష్కరిణియుఁ జాలపవిత్రములుగఁ బరిగణింపఁబడు చున్నవి. దీనిం జేసి మహాపురుషుల శవముల నిటఁదెచ్చి దహనాదిక్రియలచేయుచుందురు. శవముల నంతదూరము తెచ్చి దహనముగావింపఁజాలనివారు అస్థికల నీఘట్టమున గంగలో గలిపి తమపెద్దలకు సుగతిఁ జేకూర్చుచుందురు.

ఇవిగాక జ్ఞానవాపి, అమృతకుండము, నాగకుండము, అగస్త్యకుండమను తీర్థములున్నవి. ఒక్కొక్క దానికిని మాహాత్మ్య మొకటికలదని భక్తులు విశ్వసించి వానియందు మజ్జనమాడుచుండురు.

ఈవల నీనగరంబునఁగొత్తమందిరములు కొన్ని నిర్మింపబడినవి. వానిలో విజయనగరము మహారాజుగారిచే గట్టఁబడిన పురమందిర మతిరామణీయంబుగ నిర్మింపఁబడినది. విద్యాపీఠము లెన్నియైన నిందుఁగలవు. కాశీవిశ్వవిద్యాలయ మిందు గొప్పది. ఆంగ్లభాషామూలమున నిది సారస్వత

సాంకేతికవిద్యలఁ బ్రజల కలవడఁజేయుచున్నది.

గంగ కొంతదూరము ప్రవహించిన పిదప ఘర్ఘరనది (gogra) దానిఁ జేరుచున్నది. దీనినే పూర్వమున సరయూనదియని పిలుచుచుండిరి. ఇది హిమాలయమున మానస సరోవర సమీపంబున నుద్భవించి, పర్వతశాఖల భేదించుకొని అయోధ్య రాజ్యములోఁ బ్రవహించి, గంగానదిలోఁ గలియుచున్నది. పైభాగమున నీనది చాలగొప్పదగుటచేత ఇది యుపనది గాదేమో యను సందియమున కాస్పదము కలుగుచున్నది. గంగనుండి అయోధ్యవఱకు చిన్న పొగయోడల రాకపోకలకీనది యుపయోగించుటచేత, ఎగుమతి దిగుమతి వ్యాపారము విశేషముగా నీనదిమీద జరుగుచుండును.

గంగ యుపనదులలో గండకీనది మఱియొకటి. ఇది నేపాళదేశమున సప్తగండకీయను నేడు చిన్న నదులుగా హిమవత్పర్వతమునఁ బుట్టి త్రివేణీకమనునట్టి పర్వతముల భేదించుకొని రెండువంకలమెల్లు ప్రవహించి శోణపురమునొద్ద గంగలోఁ గలియుచున్నది. సంవత్సరమున కొకసారి యీసంగమస్థానమున స్నానము చేయుటకు రమారమి మూడులక్షల జనులు చేరుచుందురు. ఈనదియందు శ్రేష్ఠమైన సాలగ్రామములు దొరకుచుండునని ప్రతీతికలదు. త్రివేణీయొద్ద నీనది నుండి యొక కాలువ త్రవ్వబడుచున్నది. దానివలన చెంపరాణ్ జిల్లాలో నొకలక్ష యెకరములభూమి ఫలవంతమగునని లెక్కించియున్నారు.

తరువాత యుపనది కౌశికి. ఇదియు నేపాళదేశమున బుట్టి నదియే. దీని పరివాహప్రదేశము (calibment area) కాంచనగంగాశిఖరము మొదలు, గోసాయినాథ్ శిఖరమువఱకు వ్యాపించి 24 వేల చదరపుమైళ్ళు కలదైయున్నది. ఇంతటి వైశాల్యముగల పరివాహప్రదేశము సింధుబ్రహ్మపుత్రానదులకే కాని యితరనదులలో వేనికినిలేదు. దీనిలో నీరున్నట్టుండి యుబుకుచుండును. ఒకొకప్పుడు 24 గంటలలో 30 అడుగులయెత్తు నీరెక్కుచుండుట కలదు. కావున నీనది నూతనమార్గములఁ జేసికొని పోవుచుండును. 1859 సంవత్సరమునుండి 1875 వ సంవత్సరము లోపల యీనది యిరువది మైళ్ళదూరము జరిగినది. దానివలన ఫలవంతమైన భూములిసుకలోఁ బూడిపోయెను. కర్మాగారములు నేలమట్టమునకు వచ్చెను. గ్రామము లేటిపాలయ్యెను. ఎంతయోభూమి నిర్మానుష్యమయి నిరుపయోగమగు బీడునేలయయ్యెను. ఈప్రాంత్యముల నుండిన నీలిమందు ఫాక్టరీలు దీని వంకు మంటిక్రింద బూడిపోగా పైనుండు పొగగొట్టములు (Chimneys) మాత్రమే యిపుడు కనఁబడుచున్నవి. ఈ నది చేయుచుండు కీడు యింతింతని వర్ణింపదరము కాకున్నయది.

ఇంతవఱకును గంగానది సమప్రదేశములఁ బ్రవహించుచుండినది. ఈసమప్రదేశము లందిపుడు సంయుక్త పరగాణములును, విహారదేశంబునుగలవు. నది కిరుపార్శ్వములందీసమప్రదేశములు క్రమముగా నెత్తగుచుఁ చిన్నచిన్న తరంగ

ములవలె ఉత్తరదక్షిణమున నుండు పర్వతప్రదేశములవఱకు వ్యాపించియున్నవి. ఇందచ్చటచ్చట మంటి మిద్దెలు గలగ్రామములు గుంపుగుంపులుగా నున్నవి. వీని నడుమ నాకసము నంటి నట్లగుపడు వృక్షరాజము లనేకములు కానవచ్చును. దూరమున మామిడి చింత వనంబులు, ఫలవృక్షపుదోటలు కన్నులపండువు చేయుచుండును. గ్రామమునుండి గ్రామమునకు దొరతనము వారిచే వేయఁబడిన కంకరరోడ్డు పామువలె వంకరటింకరలుగా బోవునట్లు గోచరమగును. దానిమీఁదఁ గిఱ్ఱుకిఱ్ఱుమని సరకులతో నిండియుండు శకటములు ముందుకు సాగుచుండ ధూళిధూసరులగు పాంథులు గుంపులు గుంపులు నామార్గమున ప్రయాణము చేయుచు జల్లని చెట్లనీడల విశ్రమించుచు ధర్మశాలలందు విడియుచుఁ బోవుచుందురు. మార్గమున కిరువైపులను గ్రామముల చుట్టును గనుచూపు దూరము గోధుమ చెఱకు జొన్న మొదలగు పంటలు పచ్చగ కానవచ్చుచుండును. ఇదంతయు గంగమైదానమే. ఇది నేల కొలది చదరపు మైళ్ళ వైశాల్యముగలదై ఫలభరితమై కోట్ల కొలది జనులఁ బోషించుచుండును.

10. డెల్టాప్రదేశము (ఉత్తరభాగము)

గంగానది రాజమహల్ కొండలవద్ద దక్షిణమునకుఁ దిరిగి యచట డెల్టాదశను జేరుచున్నది. ఈప్రాంత్యమున టిబెట్ దేశములో దక్షిణభాగమున పారి తూర్పుభాగమున హిమాలయపర్వతమును జీల్చుకొనిప్రవహించు బ్రహ్మపుత్రా

నది గంగానదిలో మిళితమగుచున్నది. హిమాలయపర్వతపుఁ దూర్పుశాఖలగు అరకాన్ పర్వతమునం దుద్భవించిన మెఘనా (Megna) నది తూర్పునుండి యిందుఁ గలియుచున్నది. ఇట్లేకమయిన నదీత్రయమునందు నీరధికముగ నుండుట యాశ్చర్యము కాదు. ఇందుండు వండుమంటికి మేరయే లేదు.

నేల మిక్కిలి చదునుగ నుండుటచేత నీరు ధారాళముగా వెళ్ళక నిశ్చాంచల్యముగ నుండున ట్లగుపడుచుండును. కావున నీటియందుగలిసియుండు వండుమన్నంతయుఁ గ్రిందికి దిగజారి డెల్టాగా నేర్పడుచున్నది. దీనిచేత నీరొకదారిని ప్రవహింపక శాఖోపశాఖలై నానాముఖముల సంద్రము జేరుచున్నది. ఇంతియగాక యీశాఖలు నిలుకడగ నుండవు. ఎచటనైన బిడికెడు చెత్త నీటికడ్డపడెనేని నీరు వేరొకవైపునకుం బ్రవహించుచుఁ గ్రొత్తశాఖ నొకదానిని ద్రవ్వుకొను చుండును. కావున నీశాఖలకు నిలుకడ యుండదు. వాని సంఖ్యకు మితి కలదనుటకును వీలులేదు. కావున నీప్రదేశమున నీటిదారులు వలత్రాళ్ళవలెఁ జిక్కగను అడ్డదిడ్డముగను ఉన్నవి.

గంగానది రాజమహాల్ కొండలయొద్ద దక్షిణమునకుఁ దిరుగు నంటిమి. ఇచట నది చీలుచున్నది. ఇందొక శాఖకే భగీరథియనుపేరు. సముద్ర మిచటికి రమారమి 300 మైళ్ళుండును. నేలదిగుడు చాలతక్కువగుటచేత నీరు నిలిచినట్లుండును. దీనిచేత వండుమన్ను క్రిందికి దిగజారి నదీశయ్యను

క్రమముగా నెత్తుచేసినది. కావుననే భగీరథిలోనికి వచ్చు నీరు క్రమముగాఁ దక్కువయ్యెను. ఆనీరంతయు పద్మానది యనుపేరున దూర్పునకు బ్రవహించి అచట బ్రహ్మపుత్రా నదితోఁ గలిసి మెఘనానదియొక్క విశాలముఖద్వారమున సాగర సంగమమగుచున్నది.

నూతనముగా నేర్పడిన పద్మానది గంగయొక్క శాఖ యయ్యును దీని జనులు పుణ్యనదిగా భావించుటలేదు. పవిత్రతయంతయుఁ బురాతనశాఖయగు భగీరథికిని కలకత్తా వఱకుఁ బ్రవహించు హూగ్లీనదికిని మాత్రమె యున్నటుల జనులు తలంచుచున్నారు. కలకత్తాదాటినపిదప హూగ్లీనదికంత గౌరవము లేదు. దీనిలోఁ గలియు టానినల్లాయను చిన్నకాలువను మాత్రమే పుణ్యనదియని నమ్ముచున్నారు. ఈచిన్నకాలువగట్టుననే పేరొందిన కాళీఘట్టమను పుణ్యక్షేత్రము కలదు.

ఈడెల్టాప్రదేశము సముద్రతీరము వెంబడి 200 మైళ్లు వ్యాపించి త్రిభుజాకారముగా నున్నది. దీని వైశాల్యము 50,000 చదరపుమైళ్ళు. ఈప్రదేశమున 400 అడుగులలోతు వఱకు వండుమన్ను తప్ప గులకరాయి యొకటియైనను గానఁబడుటలేదు. ఇంతయినను ఈప్రదేశము సముద్ర మట్టముమీఁద కొన్ని యంగుళములకంటె నెక్కువ యెత్తుగా నుండుట లేదు. కావున గంగాసాగర సంగమప్రదేశమున నెన్నియో ద్వీపము లేర్పడియున్నవి. నదులలోనికి వెల్లువలు

వచ్చినను, సముద్ర ముప్పొంగినను ఈద్వీపములేగాక ఇందలి ప్రదేశములు నీటమునుగుచుండును. కావున జలప్రళయము వలని భయ మీప్రాంతములవారికి విశేషము.

ఈడెల్టాయొక్క పైభాగమునఁ గనుచూపుదూరమువరి పొలములచేఁ బచ్చగనుండును: వీనిచుట్టునను వెదురుపొదలు కొబ్బరిచెట్లుపోకవృక్షములు బారులుతీరి ఈకలవంటిమట్టలతో నిటునటు లాకసమునను య్యాలలూగుచుఁ గన్నులకింపుగఁ గన్పడుచుండును. నడుమనడుమ నచ్చటచ్చట నీరు నిలిచియుండుట చేత నవి చిన్నకొలకులయి కమలాకరము లగుచుఁ బుష్పములచే శోభిల్లుచు నేత్రోత్సవముచేయుచుండును. కొంచె మెత్తుగనుండు ప్రదేశములందు మఱ్ఱి చింత మొదలగు వృక్షము లాకాశమునంటునట్లు పెరిగి వానిక్రిందఁ గట్టఁబడిన పల్లియలమఱుగుపఱచుచుండును. కావున దూరమునుండి చూచువారల కీప్రదేశమంతయు వృక్షలతాకుంజంబులచే నొప్పుచుండు వనమని తోఁచునుగాని జననివాసమని తోఁపదు. అయిన, నిందు జనసంఖ్యమిక్కుటము. గ్రామము లనేకములు. పట్టణములు మెండు. ఇందన్నింటిలోను కలకత్తానగరము నగరులపట్టణమని ఖ్యాతిపొందినది.

కలకత్తా.

ఇది ఆంగ్లేయుల యాగమనమునకు బూర్వ మొక బెస్తపల్లెగా నుండినది. నావికవీరులగు ఆంగ్లేయులు మొగలు చక్రవర్తుల యనుమతిఁబొంది వాణిజ్యాగారములు బంగాళా

దేశమున నిర్మించుకొనిన తరువాత వారిచట ఆత్మసంరక్షణార్థమై కోటను నిర్మించుకొనిరి. ఇదియే ఫోర్టువిల్లియం (Fort william) క్రమక్రమముగా వీరు బలవంతులై బంగాళా దేశమునంతను ఆక్రమించుకొని యెగుమతి దిగుమతు లీప్రదేశమునుండి చేయుచుండుటచేత నిచట బెస్తపల్లియగా నుండిన యీగ్రామము పట్టణమయ్యెను. ఆంగ్లేయుల ప్రాబల్య మధికమయినకొలఁది యీపట్టణము వృద్ధియగుచుఁ గడపట నగరరాజమయ్యెను. భరతఖండమునకు రాజధానియయ్యెను.

ఈనగరము గంగశాఖయగు హుగ్లీనదిమీఁద నిర్మింపఁబడినది. ఈహుగ్లీనదికి శాఖయగు టాలినల్లాయను నొక చిన్నకాలువపైఁ గట్టబడి యుండు కాళికాలయమునుండి ఈ నగరమునకు కలకత్తా (కాళికత్తా) యనుపేరు వచ్చినది.

ఇప్పుడిది నగరరాజమయ్యెనని చెప్పితిమి. నదివెంబడి నావ లనేకములు నిలుచుండి సరుకుల యెగుమతి దిగుమతికి సాయపడుచున్నవి. దీని కనుగుణముగ గట్టున నెన్నియో మిల్లులు పనిచేయుచుఁ బొగచేత నీప్రదేశమును నివాసమున కయోగ్యముగఁ జేయుచున్నవి. ఈపట్టనమున స్థలము దొరకుట కష్టమగుటచేత నదికి కుడిప్రక్కన నయితము ఫాక్టరీలు బయలుదేరి ఆభాగము నయితము జనసమర్దమై యున్నది. దీనికే హౌరా (Hourah) నగరమనిపేరు. ఈరెంటికిని నడుమ హుగ్లీనది ప్రవహించుటచేత నీరెంటిని గలుపుట కొకవంతెనఁ గట్టియున్నారు. దీని నడిమిభాగము పడవల

మీఁద నిర్మింపఁబడియుండుటచేత దినమున కొకటి రెండు మారు లావంతెనను విడదీసి పెద్దపెద్దనావలు యేటిపైభాగ మునకుఁ బోవునట్లు అనుకూలపఱచి యున్నారు. ఈగడువు కాలమున బండ్లువంతెనమీఁదఁ బోవుటకు వీలుండదు. కాని జనులు క్రింద నీటసిద్ధముగ నుండు చిన్నపడవల (Ferry)లో నదిని దాటఁగల్గుదురు. సమీపమున రాణిగంజియందు అపారముగ నేలబొగ్గు దొరకుటచేతను, డెల్టా భూములలో జనుము విస్తారముగఁ బండుటచేతను కలకత్తానగరమున గోనెసంచుల యంత్రశాల లనేకములున్నవి. ఈమిల్లులలో సిద్ధమగు గోనెసంచులే అన్ని దేశములకుఁ నెగుమతియగుచున్నవి.

ఇట్టి జనసమ్మర్దముగల నగరరాజమున వాయువు నిష్కల్మషముగ నుండకుండుట వింతకాదు. కావున నచ్చటచ్చట చౌకము లనబడు (Squares) విశాలములైన ఖాళీ స్థలము లున్నవి. ఇచట చిన్నచిన్న తోటలువేసి సుందరమగు పొదరిండ్లనమర్చి అచ్చటచ్చట ఆసనముల వేసియుండుటచేత జనులు సాయంకాలమున నటఁజేరి అచటి శుద్ధవాయువును బీల్చుకొని ఆరోగ్యవంతు లగుచుందురు. ఇట్టి చౌకములు నగరమున ననేకము లున్నవి. కాని ఈడన్ ప్రమదావన మన్నిటికంటెను జాల పెద్దది. ఇయ్యది విశాలప్రదేశము నాక్రమించుకొని రమణీయమగు పుష్పవృక్షముల చేతను, గుబురుగా నెదిగియుండు వృక్షలతలచేతను శోభిల్లుచుఁ జూపరులకు నయనోత్సవము సేయుచు, నానాభాగములనుండి

జనుల నాకర్షించుచు ఆనగరమునకు ఊపిరితిత్తు లనందగి యున్నవి. జనులు సాయంసమయమున నిచటి పరిశుద్ధ వాయువు కొఱకు గుంపులు గుంపులుగా వచ్చుచుందురు.

ఈ నగరమున కనతి దూరమున నోషధోద్యాన (Botanical garden) మొకటి కలదు. ఇందు వివిధము లైన యోషధులఁ బెంచుచుండుటచేత వృక్షశాస్త్రమును నైచ్ఛిక శాఖగాఁ గొనిన విద్యార్థులిచటికిఁ బోవుచుందురు. ఈనగర మందలి మ్యూజియము చాల ప్రసిద్ధిచెందినది. ఇందన్నివిధ ముల జంతువుల శవములను జనులు చూడవచ్చును. ఇదిగాక సమీపమున నొక జంతువుల యాలయము (Zoo) మొండు కలదు. దీన సజీవములగు జంతువు లెన్నియో పోషింపఁబడు చున్నవి. ఇందొకచోట విధివిరుగడలేక ఇటునటుఁ దిరుగు చుండు నక్కలు కనఁబడును. మఱియొక స్థలమున నిద్రించు వానివలె నోరు తెఱచుకొని బరుండియుండు వ్యాఘ్రంబులు కానవచ్చును. ఇంకొకచోట వికారంబుగ, గన్పడు లొట్టెపిటలు గోచరించును. వేరొకచోట భయంకరంబుగఁ గన్పడు పన్న గములు కన్నుల నాకర్షించును. ఇంకొక పజ్జ నయనోత్సవం బుగ మరాళంబులు తమ యందమైన పురుల విప్పి నిలు చుండియుండును. మఱియొక ప్రదేశంబున వివిధములైన వానర ములు చెంగుచెంగున గంతులువేయుచు చూపరుల దిలకించి పండ్లికిలించుచు గుఱ్ఱుమనుచు వారిచ్చు ఫలంబులఁ దినుచు నెన్నియో విధముల నాడుచుండును. వేరొకప్రదేశమున పలు

విధములైన పక్షులచే నొప్పు విహంగములు వివిధములుగ ఋతము సేయుచుండును. ఇట్టి జంత్వాలయమును జూచి యానందించుట కెందరో జను లనుదినము పోవుచుందురు.

డెల్టాప్రదేశము (b) దక్షిణభాగము.

డెల్టాయొక్క యుత్తరభాగ మిట్లు ఫలభరితమై జనసమ్మర్దము కలదై యున్నను సముద్రతీరము నంటియుండు దక్షిణభాగ మట్లుండుటలేదు. ఇచట నేలయంతయు రొంపి మయము. సుందరివృక్షారణ్యముల కాటపట్టు. సముద్రతీరమున మాంగ్రోవు (Mangrove) అరణ్యము దట్టముగ నున్నది.

ఈ యడవులనుండియే డెల్టాలోనివారలకుఁ గావలసిన వంటకట్టెలు వచ్చును. ఇచట విశేషముగనుండు తాటిచెట్లు బీదవారల ఇండ్లకప్పునకు గావలసిన యాకంతయు నిచ్చును. సుందరీవృక్షముల కలప పడవలుచేయుట కుపయోగించును.

సుందరీవృక్షములు మిక్కిలి యున్నతముగాఁ బెరిగి యుండును. వానిక్రిందఁ మొలచియుండు గడ్డిగాదము, తీగెలు నల్లిబిల్లిగఁ జెట్ల నల్లుకొని దినకరుని కిరణములఁ జొరనియ్యకుండును. ఇందు వ్యాఘ్రములు మెండు. ఇవి సామాన్యపు జంతువులవలె నుండక గోధుమవన్నెచే నొప్పుచు నల్లని చారలు కలవై యుండును. సాధారణముగా నివి జింకల వేటాడి జీవించుచుండును. ఇవి నీట నీదుచుఁ జేపలఁబట్టి దినుచుండుట కూడఁ కలదు.

పులులలో మనుష్యమాంసము రుచిమరిగినవానివలని బాధ యింతని చెప్ప తరము కాదు. అరణ్యమున పడవలనుండి గట్టునకు దిగుటయే అపాయకరము. రాత్రులందు పడవను గట్టునకు దూరముగా నీటనుండునట్లు కట్టివేయనియెడల పులులు పడవలను సమీపించి నిద్రపోవుచుండువారలలో చియ్యబట్టియుండువానిని నోట గఱచుకొని పోవుచుండును. ఇందుచేత జెట్లనఱుకువారు సుందరీవనారణ్యములకుఁ బోవునపుడు మాంత్రికుఁడగు ఫకీరు నొకనిఁ దమవెంటఁ దీసికొని పోవుచుందురు. ఈ మాంత్రికుఁడు మంత్రబలముచేఁ బులులను దఱిమివేయుటకు బదులు ఒకొకపుడు పులులవాతఁ నితఁడే పడిపోవుచుండును.

ఈ యరణ్యమున మొసళ్ల సంఖ్యకు మితియే లేదు. అచ్చటచ్చట గట్టులమీద బీరెండలోనివి దూలములవలెఁ బడియుండిసమీపమున కేతెంచు పడవల చప్పుడు వినవచ్చిన తోడనే గుభాలున నీట దుమికి కంటి కగుపడకుండ మునిగి పోవుచుండును. వీని వలన నేటేటను జను లనేకులు మృతి నొందుచుందురు. ఇచట నీటస్నానము చేయుట మిక్కిలి అపాయకరము. అట్లు చేయ సాహసించినవారు తఱుచుగా మొసళ్ల పాలగుచుందురు. అందుచేత నీటిలో గట్టునుండి అర్ధచంద్రాకారముగా గంచెవలె దగ్గరదగ్గర కఱ్ఱలు పాతి యా కంచెలలో స్నానము చేయుటయే క్షేమకరము. ఒకొకప్పుడిదియుఁ గూడ హానికరమె యగును. ఏమన

నీజిత్తుల మారి మొసళ్ళు రాత్రులందు నేలమీఁదుగా నడిచి కంచెలలోఁ జేరి మొదట స్నానమునకు వచ్చినవారిని దమ వాతవేసి కొనిపోవుచుండును.

ఈ సుందరీవనములోని నదీశాఖలందుఁ జేపలు విస్తారముగా నుండును. మనుష్యులఁ జంపు సొరచేపలు మొదలు మనుష్యుల కాహారమగు చిఱుచేపలవఱకును యెన్నియో రకముల మీనములిచటఁ గలవు. వీనిలో చెట్టెక్కు చేపలు చిత్రమైనవి. ఇవి చిన్నవి. వీని జిల్లుల (Gills) వెంబడి బిరుసైన ముండ్లుండుట (spines) చేత వాని సాయమున నివి చెట్లెక్కఁగలవు. మాన్‌గ్రోవు వృక్షపుఁగొమ్మల నెక్కి నీటిమీఁద నొకటి రెండడుగుల యెత్తున నివి వేలకొలది వ్రేలాడుచుండుట చూపరుల కాశ్చర్యము కలిగింపక మానదు.

ఇట్టి సుందరీ వనారణ్యంబునుండి గంగానది నానాముఖముల సముద్రముఁ జేరుచున్నది. ఇచట నెన్నియోద్వీపములు కలవు. అందు సాగరద్వీపము పేరొందినది. గంగాసాగరసంగమస్థల మిది యని పూర్వమునుండి తైర్థికు లనేకు లేటేటను ఇచట స్నానముకొఱకై మూగుచుందురు. వీరలలోఁ గొందఱు బుద్ధిపూర్వకముగా మొసళ్ల కెఱయగుచుండుటఁ దెలిసికొని మార్క్విస్ ఆఫ్ వెలస్లీప్రభువు 1802 వ సంవత్సరమున ఆక్రూరాచారము నాపివేయించెను.

ఇట్లు హిమవన్నగాగ్రములనుండి క్రిందిగి దిగజారుచూ హిమానీనదంబుల నుద్భవమంది, లెక్కకు మిక్కుటంబుగ

నుండు ఉపనదులు తెచ్చి తన కప్పగించు వండుమంటిని నీటిని సమభూముల కిచ్చి వానిని ఫలవంతముగ చేసి, దానిచే గోట్ల కొలది ప్రాణుల జీవనమున కాధారమగుచుండు నీ నదీమతల్లి ప్రపంచపు నదులలో కెల్ల పుణ్యానదియనియు, ఆమె సాక్షాద్విష్ణుపాద సంభూతయు హిమభూధరంబున కనుంగు సుతయు, పరమేశ్వరు ప్రియపత్నియునయి యాతని జటాటవినుండి వెడలి ముల్లోకవాహినియై జనుల నెల్ల ముముక్షువులఁ జేయగల బరమపావని యనియు ముప్పది కోట్ల భారతీయులు తలంచి యనుంగు తల్లిగ భావించి భక్తితో నామెను బూజించి:

నమస్తేస్తుగంగే-త్వదంగప్రసంగాత్
భుజంగాస్తురంగాః కురంగాః ప్లవంగాః
అనంగారిరంగా స్ససంగాశ్శివాంగా
భుజంగాధిపాంగీకృతాంగా భవంతి. 1
నమోజహ్నుకన్యే-నమన్యేత్వదన్యై
ర్నిసర్గేందుచిహ్నాదిభిర్లోకభర్తుః,
అతోహం నతోహం-సతో గౌరతోయే 2
వసిష్ఠాదిభిర్గీయమానాభిధేయే.
త్వదామజ్జనాత్సజ్జనో దుర్జనో వా
విమానైస్స మానస్సమానైర్హిమానైః
సమాయాతి తస్మిన్ పురారాతిలోకే
పురద్వార సంరుద్ధ దిక్పాలలోకే. (కాళిదాసః)

అని స్తుతించుట వింతకాదు. పిపీలికాది సమస్త జంతువులయందును వృక్షములు మొదలగు సమస్త స్థావరముల యందును పరమాత్మ నిండి నిబిడీకృతమై యున్నదని విశ్వసించు భారతీయుల కిది యొక న్యూనత కాఁజాలదు.

సంపూర్ణము

భ్రమప్రమాదజనితములగు తప్పులందందు గానఁబడుచున్నవి. వానిలో ముఖ్యమైనవాని నిందుఁ బొందుపఱచెదము.

పుట—పఙ్క్తి	తప్పు	ఒప్పు
5—9	అర్థశాస్త్రాదిన్యాయ	అర్థశాస్త్రన్యాయశాస్త్రాది
9—2	నిష్టాగరిష్టం	నిష్ఠాగరిష్ఠం
11—17	మీరిప్పుడు	మీరప్పుడు
12—23	చూర్ణంబు	బూర్ణంబు
12—10	ఘటనాశ	ఘనాశ
15—14	గౌరిశంకర	గౌరీశంకర
16—3	నిఝరుల	నిర్ఝరుల
22—12	భరంబోర్వన్	భరంబోర్వకీ
10	కంకరోరగపతీ	కంకణోరగపతీ
16	శరధురెల్లను	శరధులెల్లను
25—4	యజ్ఞయాశ్వంబు	యజ్ఞీయాశ్వంబు
26—6	ప్రతియొక్కడును	ఒక్కొక్కడును
9	బరికించియ	బరికించియతి
27—10	జికౌసులు	బకాసులు
29—2	యాతనిజెంత	యాతనిచెంత
29—15	రాక్షసమంద	రాక్షణమంద
32—21	గల్లోలక్ష్మీ	గల్లోలలక్ష్మీ
33—1	మీావారి	మావారి
34—1	నిరాహారంబులు	నీరాహారంబులు
35—17	భంగిభంగరఘునోదన	భంగిభంగురఘునోదన
21	నదభ్య	నదభ్ర
37—4	గీరధి	గీరథి
38—15	భగీరధి	భాగీరథి
40—6	భగీరధి	భాగీరథి
43—3	సముద్రిమట్టము	సముద్రపుమట్టము

పుట—పఙ్క్తి	తప్పు	ఒప్పు
48–18	బదరీకాశ్రమము	బదరకాశ్రమము
20	బదరినారాయణము	బదరీనారాయణము
49–5	యూహా	యూహా
51–16	లక్ష్మణజూలా	లక్ష్మణఝూలా
56&78	వదలివేయవలయును	
57–19	యతి	చాల
61–3	పృథ్వ	పృథ్వ
61–17	జయసంభము	జయస్తంభము
62–5	తీమె నేకగ్రీవముగ	లేకగ్రీవముగ
62–15	నౌకావలము	నౌకాబలము
68–5	త్రివేణీసంగనుము	త్రివేణీసంగమము
68–11	గల్పించుచు	గన్పించుచు
72–3	పశువులు	పసువులు
73–18	గోమత	గోమతీ
75–22	వామగం	వామభాగం
78–10	దీనిం	దీనం
78–15	అగస్థ్య	అగస్త్య
80–3	గోసాయినాథన్	గోసాయినాథన్
80–21	పరగాణములు	పరగణాలను
82–2	మెఘునా	మేఘునా
82–20	భగీరథ	భాగీరథ
85–8	నగరరాజమయ్యెను	నగరరాజమయి
85–19	జనసమర్ద	జనసమ్మర్దమై
87–18	మరాళంబులు	మయూరంబులు
88–8	సుందరివృక్షా	సుందరీవృక్షా
91–8	జేయగలబరమపావని	జేయఁగలపరమపావని
92–1	స్థుతించుట	స్తుతించుట

BOOKS BY

Mr. M. SITARAMA RAO, B. A., L. T., Headmaster

B. H. School, Chandragiri.

		రూ.	అ.	పై.
(1)	భౌతిక భూగోళము (రెండవకూర్పు కావలసియున్నది)			
(2)	జూనియర్ భూగోళము 1-వ భాగము ...	9	10	0
(3)	బ్రిటిష్ అమెకాలనీలు } (VI)ఫా ...	0	7	0
(4)	ఇండియా } ...	0	9	0
(5)	అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా (III) ఫా	1	0	0
(6)	ఆసియా, ఐరోపా (II)	0	10	0
(7)	మొదటి భూగోళము (I)	0	10	0
(8)	బొమ్మల చెన్నరాజధాని (V)త	0	6	0
(9)	బొమ్మల భూగోళము (IV)	0	5	0
(10)	పరిశ్రామికహిందూదేశము	0	8	0
(11)	రామాయణకథలు	0	5	0
(12)	మహాభారతకథ	0	4	0
(13)	గరుడుఁడు సర్పయాగము	0	4	0
(14)	భీముఁడు	0	5	0
(15)	అర్జునుఁడు	0	5	0
(16)	భీష్ముఁడు	0	5	0
(17)	కర్ణుఁడు	0	5	0
(18)	బలిచక్రవర్తి	0	4	0
(19)	పరశురాముఁడు	0	4	0
(20)	దుర్యోధనుఁడు	0	10	0
(21)	బుద్ధుఁడు	0	8	0
(22)	హరిశ్చంద్ర చరిత్రము	0	12	0
(23)	జూలియస్ సీజరుచరిత్రము	1	0	0
(24)	హైదర్ టిప్పుసుల్తాన్	1	4	0
(25)	కెనిల్ వర్త్నవల	1	4	0
(26)	గంగానది (బొమ్మలతో)	0	9	0

END OF
TITLE